ప్రజాశక్తి
బుధవారం 31 డిసెంబర్ 2025
12 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఎర్ర జెండా అండగా.. సిఐటియు పండగ..

★ నేటి నుంచి విశాఖలో 18వ అఖిల భారత మహాసభ
★ ఊరూ వాడా ఎర్రెర్రని తోరణాల రెపరెపలు
★ రాగల మూడేళ్లకు మహాసభల్లో కార్యాచరణ
★ విశాఖ స్టీల్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, లేబర్ కోడ్స్‌పై పోరాటాలకు దిశా నిర్దేశం

సిఐటియు మహాసభకు ముస్తాబైన ఎయు కన్వెన్షన్ సెంటర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనే కార్మిక పోరాటాలకు కేంద్రం, ప్రభుత్వ రంగ సంస్థల నిలయం విశాఖ నగరం డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకూ జరుగు సిఐటియు అఖిల భారత 18వ మహాసభలకు వేదికగా మారింది. ప్రపంచ కార్మిక సంఘాల ఫెడరేషన్ (డబ్ల్యుఎఫ్‌టియూ) ప్రతినిధి పంబిస్ కిరిట్సిస్ బుధవారం ఉదయం 9.30గంటలకు జ్యోతిని సాగర తీరం ఆర్‌కె.బీచ్‌లోగల ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు తీసుకొస్తారు. అనంతరం అక్కడ సిఐటియూ ఆలిండియా అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత జెండా ఆవిష్కరణతో మహాసభలు ప్రారంభం కానున్నాయి.

సిఐటియు అఖిలభారత 17వ మహాసభలు 2023లో బెంగళూరులో జరిగాయి. ప్రతి 3ఏళ్లకూ మిగతా 2లో..

శ్రామిక ఉత్సవ్ వేదికపై కోలాటం ఆడుతున్న ఆశా కార్యకర్తలు

ఉత్సాహం.. ఉత్తేజం..

సందడిగా శ్రామిక ఉత్సవ్ - నాలుగో రోజూ జనతాకిడి ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా తలపెట్టిన కళా, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫొటో, కార్టూన్, సైన్స్ ఎగ్జిబిషన్లను చూసేందుకు యువత తరలివచ్చారు. మంగళవారం నాటి ఉత్సవ్‌లో సినీ నటులు రోహిణి, మాదాల రవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిరువురూ ఉత్సవ్‌లోని అన్ని స్టాల్స్‌నూ కలియదిరిగారు. ఉత్సవ్ ప్రధాన వేదికపై వారు చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎర్రజెండా గొప్పతనాన్ని తెలియజేసింది. వారి మాట్లాడుతున్నంతసేపూ చప్పట్ల వర్షం కురిసింది.

(వార్తలు మెయిన్, టాబ్లాయిడ్‌లో..)

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు వేగవంతం : కలెక్టర్

▶ వార్త 2లో..

మద్యం అమ్మకాలు నిషేధించాలి : ఐద్వా

▶ వార్త 9లో..

అభిప్రాయాల సేకరణ తర్వాతే..

రుషికొండ భవనాలపై తుది నిర్ణయం

▶ వార్త 4లో..

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

విశాఖలో 11.78 శాతం తగ్గిన నేరాలు

నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు గణనీయమైన ప్రగతి సాధించారని, గడిచిన ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నగరంలో నేరాలు 11.78 శాతం తగ్గాయని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం కమిషనరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన 2025 వార్షిక నేర నివేదికను విడుదల చేసి, పూర్తి వివరాలను వెల్లడించారు.

గత ఏడాది (2024) నగరంలో మొత్తం 9,278 కేసులు నమోదు కాగా, 2025లో ఆ సంఖ్య 8,185కు తగ్గింది. ప్రధానంగా క్రైమ్ విభాగంలో గతేడాది 5,921 కేసులు ఉండగా, ఈ ఏడాది అవి 5,168 నమోదయ్యాయి. మహిళలపై జరుగుతున్న నేరాలు 22 శాతం (1216 నుండి 951కి) తగ్గగా, చిన్నారులపై నమోదైన కేసులు 131 నుండి 75కి తగ్గాయి. ఆర్థిక నేరాల విలువ గత ఏడాది రూ.9.38 కోట్లు ఉండగా, ఈ ఏడాది రూ.7.82 కోట్లకు తగ్గింది. పోలీసుల చొరవతో ఈ ఏడాది ప్రాపర్టీ రికవరీ శాతం 63శాతం నమోదైంది. (గత ఏడాది 53శాతం). కేసుల మిగతా 2లో..

సిపిఎం నేత అప్పలరాజుపై పీడీ యాక్టు సరికాదు

★ జెడ్‌పి సమావేశంలో సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు, పలువురు సభ్యుల ధ్వజం
★ తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్
★ పలు సమస్యల ప్రస్తావన

వేదికపై జెడ్‌పి చైర్‌పర్సన్స్, కలెక్టర్లు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

నక్కపల్లి మండలం రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న మత్స్యకారులకు మద్దతు తెలిపిన సిపిఎం నాయకుడు ఎం.అప్పలరాజును పీడీ యాక్టు కింద అరెస్టు చేసి జైలుకు పంపడం సరికాదని అనంతగిరి మండల సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకునిపై పీడీ యాక్టు ప్రయోగించడం చట్ట విరుద్ధమన్నారు. అప్పలరాజుపై తక్షణం పీడీ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విశాఖపట్నం, అనకాపల్లి, మిగతా 2లో..

అంచనా బడ్జెట్‌కు ఆమోదం

2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2026-2027 సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌కు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై అధికారులు నివేదికలు సమర్పించారు.

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు వేగవంతం

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఎంఎస్ఎంఈ నానో పార్కుల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, వారం రోజుల్లో అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలో 7 నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే స్థలాల గుర్తింపు పూర్తయిన చోట్ల కార్యకలాపాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, గుర్తించని చోట అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో స్థలాల గుర్తింపు పూర్తి కావాల్సి ఉందని, మిగిలిన చోట్ల పూర్తయినట్లు ఎపిఐఐసి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, రవాణా సదుపాయాలు కూడా కల్పించాల్సి ఉందన్నారు. ఆటోనగర్, మధురవాడ ఐటీ పార్కులో బస్టాప్‌లు ఏర్పాటు చేయటంతో పాటు ప్రత్యేక బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుంగ్లాం వద్ద రైల్వే ట్రాక్‌ల మధ్యలో ఉన్న ప్రభుత్వ భూమిని వినియోగించుకోవటం లేదా ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు అంశంపై రైల్వే శాఖకు లేఖ రాయాలన్నారు. గాజువాక, ఆటోనగర్ వద్ద గల రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబి) పనుల్లో వేగం పెంచాలని, జూన్ తొలివారం నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. జనవరి 10 నాటికి రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ పబ్లిష్ చేయాలన్నారు. భూ కేటాయింపులు జరిగిన ప్రాంతాల్లో 6 నెలల లోపు పరిశ్రమలు నెలకొల్పాలని, లేదంటే నోటీసులు జారీ చేయాలని ఎపిఐఐసి అధికారులను ఆదేశించారు. ఇటీవల దువ్వాడ విసెజ్‌లో సినర్జీస్ డూరే అనే కంపెనీలో ఉద్యోగాలు కోల్పోయిన బాధిత కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఆదిశేషు, ఎపిఐఐసి జెడ్ఎం సింహాచలం, ఐలా ప్రతినిధులు, పారిశ్రామకవేత్తలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు హోల్డర్లకు కిలో రూ.20కే గోధుమ పిండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలోని అన్ని రేషన్ డిపోలో జనవరి 2 నుంచి రేషన్ కార్డులపై ఒక్కొక్కరికి కిలో రూ.20 చొప్పున చెక్కి గోధుమ పిండి ఇవ్వటం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మీడియాకు తెలిపారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు ప్రతినెల బియ్యం, రాగులు ఉచితంగాను, చక్కెర సబ్సిడీ ధరపై పంపిణీ చేస్తుండగా, వీటికి అదనంగా చెక్కి గోధుమ పిండిని పంపిణీ చేయాలని నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో చెక్కి గోధుమ పిండి ధర కిలో రూ.45 నుండి రూ.80 వరకు ఉండగా, రేషన్ దుకాణాల ద్వారా కేవలం రూ.20కే ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈసరికే సరిపడా మొత్తంలో చెక్కి గోధుమపిండిని జనవరి నెల పంపిణీ కోసం రేషన్ దుకాణాలకు పంపడం జరిగిందన్నారు.

'పట్నం హౌస్' రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : నగరంలోని ఆర్‌కె మిషన్ ఎదురుగా బీచ్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "పట్నం హౌస్" రెస్టారెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. డాక్టర్ ఎంవివిఎస్ బాపారావు, డాక్టర్ కెవి.మధుబాబు, డాక్టర్ బి.లీలాప్రసాద్ అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులకు, నగరవాసులకు ఒకే చోట ఇండియన్, చైనీస్, కాంటినెంటల్, మొఘలాయ్ రుచులను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇండోర్ అవుట్ డోర్ కలిపి మొత్తం 74 మంది కూర్చునే సామర్థ్యం ఈ రెస్టారెంట్‌లో ఉందని చెప్పారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా అనుభవజ్ఞులైన చెఫ్స్ ద్వారా వంటకాలు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

పట్నం హౌస్ రెస్టారెంట్ ప్రారంభంలో పాల్గొన్న అతిథులు

మొదటి పేజీ తరువాయి..

సిపిఎం నేత అప్పలరాజుపై పీడీ యాక్టు సరికాదు

అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎంఎన్.హరేంధిర ప్రసాద్, విజయకృష్ణన్, దినేష్ కుమార్ పాల్గొన్న ఈ సమావేశంలో అప్పలరాజు అక్రమ అరెస్టుపై గంగరాజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంజాయి మాఫియా, దారి దోపిడీదారులపై వాడాల్సిన పీడీ యాక్ట్‌ను ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై ప్రయోగించడం అన్యాయమన్నారు. గతంలో ఇదే జిల్లా పరిషత్ సమావేశంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయాన్ని గంగరాజు గుర్తు చేశారు.

నక్కపల్లి జెడ్పిటిసి గోసల కుశలమ్మ మాట్లాడుతూ, తమ మండలంలో ప్రజా సమస్యలపై నిత్యం పనిచేసే నాయకుడు అప్పలరాజు అని, బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు పోరాటం ప్రారంభిస్తే దానికి అప్పలరాజు మద్దతు ఇచ్చారని, మత్స్యకారులను ప్రేరేపించడంలో ఆయన పాత్ర లేదని స్పష్టం చేశారు. అటువంటి నాయకునిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. మరి కొంతమంది జెడ్‌పిటిసి సభ్యులు కూడా అప్పలరాజుపై పీడీ యాక్టు ప్రయోగాన్ని వ్యతిరేకించి గంగరాజు, కుశలమ్మ డిమాండ్‌కు మద్దతు తెలియజేశారు.

అర్హులైన వికలాంగులకు పింఛన్లు అందించాలి

అర్హులైన వికలాంగులకు పెన్షన్లు అందటం లేదని, అనర్హులకు మాత్రం పెన్షన్లు మంజురవుతున్నాయని అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఆరోపించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నిజమైన అర్హులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అల్లూరి జిల్లా డిఎంహెచ్ఓ పనితీరు బాగోలేదు

అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జెడ్పీ సమావేశాలకు హాజరు కాకపోవడం సరికాదని, జిల్లాలో కూడా ఆయన పనితీరు సక్రమంగా ఉండటం లేదని, ముఖ్యంగా అల్లూరు జిల్లాలోని పిహెచ్‌సిల పనితీరుపై ఆయన పర్యవేక్షణ ఉండటం లేదని అనంతగిరి జెడ్పిటిసి గంగరాజు విమర్శించారు. అనంతగిరి మండలం రోంపల్లి పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ఎంపిహెచ్ఓ, సబ్ సెంటర్ ఎఎన్ఎం, సచివాలయం ఎఎన్ఎంలను డెప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపించారని, ఈ వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతగిరి కొత్తవలస బాలుర ఆశ్రమ పాఠశాలలో వసతి గృహానికి నూతన భవనం నిర్మించడానికి నిధులు కేటాయించాలని కోరారు. అల్లూరి జిల్లాలో రోడ్ల అనేక చోట్ల అసంపూర్తిగా పనులు నిలిచిపోయాయని, ఎన్ఆర్ఈజిఎస్ నిధులు విడుదల చేసి వాటిని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అరకు జెడ్పిటిసి శెట్టి రోషిణి మాట్లాడుతూ, అరకు మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, వాటిని తక్షణం మరమ్మతు చేసి అభివృద్ధి చేయాలని కోరారు.

అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించాలి

అచ్యుతాపురం జెడ్పిటిసి లాలం రాంబాబు, జెడ్పి కో-ఆప్షన్ సభ్యుడు కుమార్ మాట్లాడుతూ రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి మండలాలను యధావిధిగా అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో కొనసాగించాలని కోరారు. కొత్తగా ఏర్పాటవుతున్న అడ్డరోడ్డు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తమ మండలాలను చేర్చడం సరికాదన్నారు. ప్రజాభిప్రాయం సేకరించకుండా ఏకపక్షంగా అడ్డరోడ్డు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేర్చడం అంగీకరించేది లేదని స్పష్టం చేశారు.

కాలుష్య నివారణకు, ఓవర్ లోడ్ లారీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

పరవాడ జెడ్పిటిసి పైలా సన్యాసిరాజు మాట్లాడుతూ, పరవాడ మండలంలో పెరుగుతున్న కాలుష్యం, నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఓవర్ లోడ్ లారీల వల్ల సామాన్య ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరవాడ మండలంలో నీరు, గాలి కాలుష్యం ఎంత తీవ్రంగా ఉందో సాక్షాత్తు పార్లమెంటులోనే చర్చ జరిగిందంటే అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్‌టిపిసి, హిందుజా కంపెనీల నుండి ప్రతిరోజు సుమారు 200 లారీలు నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో తిరుగుతున్నాయని, వీటి వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడమే కాకుండా, తరచూ ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. లంకెలపాలెం జంక్షన్‌లో కాలుష్యం కారణంగా కనీసం 10 నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల బినామీలే ఈ లారీల కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం వల్ల ఆర్టీవో అధికారులు ఓవర్ లోడ్ లారీలపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారని ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కాలుష్య నియంత్రణకు, ఓవర్ లోడ్ లారీల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో మూడు జిల్లాల కలెక్టర్లు, జెడ్పిటిసిలు, ఎంపిపిలు, మూడు జిల్లాల జిల్లాస్థాయి అధికారులు, జిల్లా పరిషత్ సిఈవో పి.నారాయణమూర్తి, ఉపముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.రాజ్ కుమార్, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరుణకుమారిని సత్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

క్రికెటర్ పాంగి కరుణ కుమారికి సత్కారం

సమావేశం ప్రారంభంలో అంతర్జాతీయ వేదికపై మెరిసిన టీ20 ఉమెన్ అంధుల క్రికెట్ టీమ్ సభ్యురాలు పాంగి కరుణకుమారిని ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ తరపున ఆమెకు రూ.39,900 విలువైన క్రికెట్ కిట్‌ను అందజేశారు.

విశాఖలో 11.78 శాతం తగ్గిన నేరాలు

ఛేదన కూడా 65శాతం నుండి 67 శాతానికి పెరిగింది. సెల్ ఫోన్ చోరీల విషయంలో పోలీసులు విశేష కృషి చేసి, గత ఏడాది కంటే రెట్టింపు స్థాయిలో 3,477 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు సిపి తెలిపారు.

సైబర్ క్రైమ్ విషయంలో విశాఖ పోలీసులు ఈ ఏడాది రికార్డు స్థాయి విజయాలు సాధించారు. గత ఏడాది 160 మందిని అరెస్ట్ చేయగా, ఈ ఏడాది ఏకంగా 205 మంది సైబర్ నేరగాళ్లను కటకటాల్లోకి నెట్టారు. సైబర్ మోసాలకు గురైన బాధితులకు గత ఏడాది రూ.3.89 కోట్లు రిఫండ్ చేయగా, ఈ ఏడాది రూ.14.64 కోట్లు వెనక్కి ఇప్పించడం పోలీసుల పనితీరుకు నిదర్శనం. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతూ 226 ఎన్‌డిపిఎస్ కేసులను నమోదు చేశారు. సుమారు 10,147 కేజీల గంజాయి, 19.31 లీటర్ల హషీష్ ఆయిల్, 1 కేజీ ఓపియంను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.5.21 కోట్లు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది మొత్తం 1,086 ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా జాతీయ రహదారి (ఎన్‌హెచ్ -16)పై 420 ప్రమాదాలు జరగగా, అందులో 149 మంది మరణించడం ఆందోళన కలిగించే అంశంగా ఉందని తెలిపారు.

సామాజిక బాధ్యత, కొత్త కార్యక్రమాలు

కేవలం కేసుల నమోదుకే పరిమితం కాకుండా, విశాఖ పోలీసులు పలు సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. జ్యోతిర్గమయ పేరుతో అనాథలకు, మతిస్థిమితం లేని వారికి ఆశ్రయం కల్పించి కుటుంబ సభ్యులతో కలిపారు. నగరవ్యాప్తంగా 597 కొత్త సిసి కెమెరాలు, నిఘా కోసం 15 డ్రోన్లను వినియోగిస్తున్నారు. 'రికవరీ మేళా' ద్వారా మొత్తం 4,979 మంది బాధితులకు రూ.10.56 కోట్ల విలువైన సొత్తును తిరిగి అందజేశామని సిపి తెలిపారు.

ఎర్రజెండా అండగా.. సిఐటియు పండగ..

ఒకసారి జరిగే జాతీయ మహాసభలకు ఈ సారి విశాఖ వేదికకావడం కార్మికవర్గ పోరాటాలకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఎంతో తోడ్పాటునివ్వనుందని అభుదయ వాదులంతా భావిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై నాలుగేళ్లకు పైగా కార్మిక పోరాటాలు జరుగుతున్నాయి. కేంద్రం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌పై పోరాటాలకూ ఈ మహాసభలు పిలుపునివ్వనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, కార్మిక విధానాలపై ఈ మహాసభల్లో చర్చించి రాగల మూడేళ్లకు ఉద్యమ కార్యాచరణకు సిఐటియు సిద్ధమవుతోంది.

ఎర్రెర్రని తోరణాలు

నగరంలోని ప్రధాన కూడళ్లన్నీ ఎర్రెర్రని తోరణాలతో మహాసభలకు హాజరయ్యే ప్రతినిధులకు, ప్రారంభ సభకు స్వాగతం పలుకుతున్నాయి. జాతీయ మహాసభల ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 6గంటలకు విశాఖ సాగర తీరంలో 'రెడ్ షర్ట్ వాలంటీర్ల' కవాతు సర్వత్రా ప్రజలను ఆలోచింపజేసింది. మహాసభలు జరిగే హాల్‌కు బాసుదేవ ఆచార్య, ఎంఎన్ లారెన్స్‌గా వేదికగా నామకరణం చేయుగా, మహాసభల ప్రాంగణానికి కామ్రేడ్ అనంతలవటమ్ ఆనందన్‌నగర్ పేరు పెట్టారు. జనవరి 4న మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభ నగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగనుంది. దీనికి ముందు నగరంలో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించనున్నారు. సిఐటియూ ఆలిండియా దిగ్గజ నేతలంతా ఈ సభలో ప్రసంగించనున్నారు. ఇప్పటికే ఈనెల 27 నుంచి 'శ్రామిక ఉత్సవ్' పేరుతో ప్రారంభమైన సాంస్కృతిక, సాహిత్య, సంగీత ఉత్సవాలు ఈ మహాసభలకు ముందు అత్యంత ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి.

నేటి ఉదయం 9.30 గంటలకు ప్రారంభం

బుధవారం ఉదయం 9.30 గంటలకు ఏయూ కన్వెన్షన్ హాలులో మహాసభ ప్రారంభ సభకు సుమారు 10 ట్రేడ్ యూనియన్‌లకు పైగా జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు హాజరై సౌహార్ద్ర సందేశాలను ఇవ్వనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రారంభసభ జరుగుతుంది.

నగరంలోని కూడలిలో ఎర్ర తోరణాలు రెపరెపలాడుతున్న దృశ్యం

మహారాజశ్రీ సీనియరు సివిల్ జడ్జి, బొబ్బిలి వారి దివ్యసముఖమునకు
I.A.No.244/2023, I.A.No.245/2023, I.A.No.246/2023 in A.S.No.3/2020

బిట్వీన్:
సాలూరు మునిసిపాలిటీ, సాలూరు రిప్రజంటేడ్ బై కమిషనర్, సాలూరు వగైరా ....పీటిషనర్లు-అప్పిలెంట్లు
మరియు :
అరిశెట్టి నాగేశ్వరరావు వగైరా
....రెస్పాండెంట్లు-ప్రతిపాదిత రెస్పాండెంట్లు

నోటీసు

టు:
R.2 : ఆరిశెట్టి హైమావతి భర్త ఆరిశెట్టి నాగేశ్వరరావు, వయస్సు 58 సం॥ బి.సి. రోడ్డు, శ్రీనగర్ కాలనీ, డి.మార్ట్ ఎదురుగా, గాజువాక, విశాఖపట్నం (PHONE NO. 9063856623)
R.3 : ఆరిశెట్టి సాగర్ తండ్రి ఆరిశెట్టి నాగేశ్వరరావు, వయస్సు 30 సం॥, బి.సి. రోడ్డు, శ్రీనగర్ కాలనీ, డి.మార్ట్ ఎదురుగా, గాజువాక, విశాఖపట్నం (PHONE NO. 9063856623)

పై నెంబరు అప్పీలు దావాలో సి.పి.సి ఆర్డరు. 22, రూలు. 4 సి.పి.సి, ఆర్డరు.22, రూలు.9 సి.పి.సి, సెక్షన్.5. లిమిటేషన్ చట్టం మరియు సెక్షన్. 151 సి.పి.సి ప్రకారం పిటీషన్లు దాఖలు చేయగా సదరు పిటీషన్లలో శ్రీకోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపుచున్నప్పటికిన్నీ మీరు తప్పించుకు తిరుగుచున్నందున యిందుమూలముగా తెలియచేయునది ఏమనగా మీరు **తే. 08-01-2025 ది న ఉదయం 10-30 గంటలకు** స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరయి మీ జవాబు దాఖలు చేసుకోవలెను. లేనియెడల పై నెంబరు దావా మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందుమూలముగా తెలియచేయడమయినది.

(పై శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం)

వడ్డాది షణ్ముఖ ముత్యాలు
అడ్వకేట్ మరియు స్టాండింగ్ కౌన్సెల్,
సాలూరు మున్సిపాలిటీ, సాలూరు.
MOBILE NO: 9440843203

సాఫ్ట్‌వేర్ కోడింగ్ లోపాలే సైబర్ దాడులకు మూలం

గీతం సదస్సులో నిపుణుల వెల్లడి

ప్రజాశక్తి-మధురవాడ : దేశంలో పెరుగుతున్న సైబర్‌సెక్యూరిటీ సమస్యలకు సాఫ్ట్‌వేర్ కోడింగ్‌లో లోపాలే కారణమని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖకు చెందిన సైంటిస్ట్ 'జి', గ్రూప్ కో-ఆర్డినేటర్ (సైబర్ సెక్యూరిటీ) సవిత ఉత్రేజా తెలిపారు. భారత్‌లో ఏటా 20 లక్షలకు పైగా సైబర్ భద్రతా సంఘటనలు నమోదవుతున్నాయని, ఇవి పెరుగుతున్న డిజిటల్ ముప్పులను సూచిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం సి-డాక్, ఐఐటి భిలాయ్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. దేశంలో సైబర్ భద్రతా ఘటనలకు స్పందించేందుకు "ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి-ఇన్)ను కేంద్రప్రభుత్వం జాతీయ సంస్థగా నియమించిందని తెలిపారు. సురక్షితం కాని సాఫ్ట్‌వేర్ అభివృద్ధి విధానాల వల్ల ఏర్పడే లోపాలను ఆసరాగా చేసుకుని సైబర్ దాడులు మరింత క్లిష్టంగా మారుతున్నాయని, ఇవి పెద్ద సంస్థలతో పాటు చిన్న వ్యాపారాలు, వ్యక్తులను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. దీని నుంచి కాపాడేందుకు సురక్షిత సాఫ్ట్‌వేర్ అత్యంత అవసరమని స్పష్టం చేశారు. సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్ (ఎస్ఎస్‌డిఎల్‌సి) విధానాలను అనుసరించడం ద్వారా సైబర్ ముప్పు నుంచి వ్యవస్థలను మరింత బలంగా రక్షించవచ్చని, భద్రతను డిజైన్ దశ నుంచే అమలు చేయవచ్చని పేర్కొన్నారు.

ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కుమార్ శుక్లా మాట్లాడుతూ, తక్కువ భద్రత కలిగిన మూడవ వ్యక్తి లేదా సంస్థలు అందించే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను లక్ష్యంగా చేసుకొని సైబర్ దాడులు జరుగుతాయని తెలిపారు. ఈ కారణంగా సాఫ్ట్‌వేర్ తయారీ సమయంలోనే భద్రత అంశాలను కీలక భాగంగా చేసుకోవాలని సూచించారు. సి-డాక్ హైదరాబాద్ కేంద్రం అధిపతి డాక్టర్ పిఆర్.లక్ష్మీశ్వరి మాట్లాడుతూ కృత్రిమమేధ పురోగతితో సైబర్ ముప్పు మరింతగా పెరుగుతోందన్నారు. గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, కృత్రిమమేధ రెండువైపులా పదును ఉన్న కత్తి వంటిదని, సైబర్ దాడులను సమర్థంగా ఎదుర్కొవడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్, సెక్యూర్ డిజైన్ థింకింగ్ అనేది సైబర్ దాడుల నుంచి రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో సి-డాక్ శాస్త్రవేత్త ఎన్.సత్యనారాయణ, గీతం సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.తిరుపతిరావు, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ కె.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సవిత ఉత్రేజా

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గండిగుండం గ్రామానికి చెందిన పెంటకోట సూరిబాబు (36) అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... సూరిబాబుకు కణమాం గ్రామానికి చెందిన రమాదేవితో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. ఆరు నెలల క్రితం రమాదేవి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో ఆమె అప్పటి నుంచి మంచానికే పరిమితమైంది. రమాదేవి కణమాంలో కన్నవారి ఇంటి వద్ద ఉంటుంది. సూరిబాబు గండిగుండంలో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజులుగా సూరిబాబుకు తీవ్రమైన కడుపునొప్పి వస్తోంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సిఐ చింత వాసునాయుడు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అవంతి విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : విజయనగరంలోని ఎమ్ఆర్ఏజిఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో అవంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సుమారు 20 పాలిటెక్నిక్ కాలేజీల నుండి 1100 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో షటిల్ బాడ్మింటన్‌లో మంగమ్ బ్లెస్సి, హైజంప్ బర్నాల జ్యోతి, రన్నింగ్ 100, 200 మీటర్లలో దాసరి రేవతి ప్రతిభ చాటారు. చెస్ పోటీల్లో బాలికలు విజేతలుగా నిలిచారు. బాలుర టేబుల్ టెన్నిస్, షటిల్ బాడ్మింటన్ పోటీలలో రెండవ స్థానంలో నిలిచారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలను ఎంపికైన క్రీడాకారులను అవంతి విద్యాసంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీల్లో కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను డైరెక్టర్లు ఎ.చంద్రశేఖర్, విశ్వప్రసాద్, డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ బి.జగదీశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కోలా చంద్రశేఖర్, చంద్రరావు, శంకర్ అభినందించారు.

వపా కథల సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి -ములగాడ : ప్రముఖ చిత్రకారులు కార్టూనిస్ట్, రచయిత వడ్డాది పాపయ్య రచించిన కథల సంపుటిని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు ఆవిష్కరించారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో స్థానిక చిత్రకళ పరిషత్ మంగళవారం నిర్వహించిన వపా 33వ వర్ధంతి సమావేశంలో కుమార్‌రాజు మాట్లాడుతూ, వపా బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. కళారత్న సుంకర చలపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రచయిత వివి.భరద్వజ గ్రంథ సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో గరిమ సాహితీ సంస్థ అధ్యక్షులు కెవిఎస్.నరసింహం, డి.త్యాగరాజు, డిఎస్.మనోహర్, సంబంగి, తంపాల శ్రీరామ్మూర్తి, ప్రభాకరాచారి, గ్రంథాలయాధికారి అజయ్ కుమార్, అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భీమిలి యూనిట్ సభ్యులకు మంగళవారం 2026 డైరీలు, మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూకరాజు మాట్లాడుతూ, సమాజంలో జర్నలిస్టుల సేవలు మరువలేనివన్నారు. జివిఎంసి మూడో వార్డు టిడిపి అధ్యక్షులు గొలగాని నరేంద్రకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు జర్నలిస్టులు వారధులన్నారు. స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి -గోపాలపట్నం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గణబాబు చెప్పారు. జివిఎంసి 92వ వార్డు పరిధి గోపాలపట్నం మెయిన్ రోడ్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గణబాబు హాజరై మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగును పురస్కరించుకొని నియోజకవర్గంలో ఉత్తమ కార్యకర్తగా ఎన్నికైనవారికి ప్రశంసపత్రాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం రెండో రోజు మంగళవారం వేడుకగా నిర్వహించారు. దుర్గాలమ్మ మూల విరాట్‌కు పంచామృత సుగంధ ద్రవ్య జలాభిషేకాలు, అనంతరం అలంకరణ, ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్పార్చన, నీరాజన మంత్ర పుష్పం, ప్రసాదాల వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం జగుపిల్లి వారి కుటుంబ సభ్యులు ధన సహాయంతో ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో సహస్ర దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగుపిల్లి నాని, జగుపిల్లి అప్పారావు, జగుపిల్లి అప్పలరాజు, గుజ్జారి అప్పారావు, జగుపిల్లి వెంకట దుర్గ అప్పారావు, పోతిన సత్యం, జగుపిల్లి ఎర్రయ్య, బైపిల్లి సురేష్, జగుపిల్లి శ్రీను, వాండ్రాసి అప్పారావు, ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షులు పివిజి.అప్పారావు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-మధురవాడ : పిఎం.పాలెం ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై తగిన చర్యలు తీసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ మన్మధరావు తెలిపారు. మంగళవారం 15 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. రోడ్లపై వాహనం నడిపేవారు వాటి ధ్రువపత్రాలు, లైసెన్సును తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ఇవిఎం గోదాము వద్ద జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇవిఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. చినగదిలి మండలంలో ఉన్న ఇవిఎం గోదాములను త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయం భీమిలి ఆర్‌డిఓ సంగీత్ మాథుర్, వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి కలెక్టర్ సందర్శించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోదాముల లోపల కూడా పర్యటించారు. అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీ క్రమంలో లాగ్ బుక్‌లో సంతకం చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై కలెక్టర్ కాసేపు నేతలతో మాట్లాడారు. పార్లమెంట్, అసెంబ్లీల వారీగా భద్రపరిచిన ఇవిఎంల స్థితిగతులను కలెక్టర్‌కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. పర్యటనలో ఆయన వెంట వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మహిళా పాలిటెక్నిక్ పరిపాలనా భవనం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి నేరెళ్లవలసలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నాబార్డు , ఆర్ఐడిఎఫ్ నిధులు రూ.12 కోట్లతో నిర్మించిన పరిపాలన భవన సముదాయాన్ని (ఎ బ్లాక్) ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రయోగ శాలల భవన సముదాయాన్ని (బి బ్లాక్) విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యారంగంలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. ప్రతి ఏటా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు.

అవకాశాలను వినియోగించు కోవాలి : ఎంపీ శ్రీ భరత్

అంది వచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ విద్యార్థినులకు సూచించారు. ప్రతిభ ఆధారంగానే విద్యా సంస్థల్లో సీట్లు, వివిధ పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగాలు కల్పించబడుతున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, తహశీల్దార్ పైలా రామారావు, టిడిపి 3వ వార్డు అధ్యక్షులు గొలగాని నరేంద్ర కుమార్, ఎపిఇ డబ్ల్యుఐడిసి, డిఇ, పి.నాగ సత్యనారాయణ, ఎఇ పి.పద్మ, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన సముదాయాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

ఆకర్షణీయంగా డంపింగ్ యార్డు : జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-కొమ్మాది : స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన నేపథ్యంలో కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌ను సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన అధికారులతో కలిసి యార్డులోని పలు విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డంపింగ్ యార్డు పరిసరాల్లో పచ్చదనం పెంపొందించాలని, అవసరమైన చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. బయో గ్యాస్, జిందాల్, సి అండ్ డి వేస్ట్ ప్లాంట్లను కమిషనర్ పరిశీలించి లెగసీ వేస్ట్ బయోమైనింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ వేస్ట్ ప్లాంట్ నిర్వహణకు ఔత్సాహికులను ఆహ్వానించాలన్నారు. లెగసీ వేస్ట్ ఎంతవరకు పూర్తయింది, మిగిలిన పనికి గడువు ఎంత అన్న అంశాలపై అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజినీర్ సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, మధురవాడ జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ రత్నాకర్‌రెడ్డి, యుఎన్‌డిపి ప్రతినిధి శ్రీనివాస్ రాజామణి, మెకానికల్ విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీరు పిఎస్ఆర్.మూర్తి, ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాల సేకరణ తర్వాతే..

రుషికొండ భవనాలపై తుదినిర్ణయం : గంటా

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండ భవనాలపై ప్రభుత్వం ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఎంవిపి.కాలనీలోని నివాసంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మ్యూజియం, ఆధ్యాత్మిక కేంద్రం, రిసార్ట్ తదితరాలకు ఈ భవనాలను ఇవ్వాలని వివిధ సంస్థలు ప్రతిపాదించాయని తెలిపారు. ఏడాదిన్నర నుంచి నిర్వహణ లేకపోవడం వల్ల భవనాలు పాడైపోతున్న నేపథ్యంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చెప్పినట్టు స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయం తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. సింహాచలం ప్రసాదంలో నత్త ఉందంటూ ఒక జంట సోషల్ మీడియాలో ట్రోల్ చేసిన విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటామని, నిజం లేదని తేలితే వారిపై పోలీస్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటవీ శాఖతో ముడిపడిన అడవివరం కాలభైరవ స్వామి ఆలయ రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని వెల్లడించారు. భక్తులకు సంబంధించిన అంశంగానే అటవీ శాఖ చూడాలన్నారు.

వైసిపిలో ఉన్నవారికి ఎలాంటి భవిష్యత్తు ఉండదని చెప్పారు. ప్రభుత్వం చేసే మంచి పనులకు ఆ పార్టీ మద్దతు ఇవ్వకపోయినా పర్వాలేదు గానీ దుష్ప్రచారం చేసి అడ్డుపడడం సరి కాదన్నారు.

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏపీలో పరిశ్రమల స్థాపనకు, విస్తరణకు పారిశ్రామికవేత్తలు ఇష్టపడలేదని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వంపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కడుతున్నారని చెప్పారు. ఏడాదిలో చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని, కొత్త ప్రాజెక్టులను వివరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, ఎర్ర రాజు, వాండ్రాసి అప్పలరాజు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లతో ఉపాధి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లోని వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లు నిరుద్యోగులకు ఉపాధిని కల్పిస్తున్నాయని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని గాజువాక ఆటో నగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గాజువాక ఆటోనగర్‌లో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి నిమిత్తం విదేశాలకు పంపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కర్రం కనకారావు, ప్రధాన కార్యదర్శి చట్టి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు బొండా అచ్చిబాబు, గ్రాండ్ వెల్డ్ ప్రసాద్, వరదేశ్, పాపారావు, ఎల్‌జి.శ్రీహరి, ఎన్.రమణ, మురళీకృష్ణ, అంజిబాబు, గిరి, బాలు, రేణుక పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న శ్రిష్టి వరల్డ్ స్కూల్ ప్రతినిధులు

'శ్రిష్టి వరల్డ్'లో 'ఫ్యూచరైజ్-2026'కు సన్నాహాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం సెక్టార్-11లోని శ్రిష్టి వరల్డ్ స్కూల్ స్థాపనకు 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'ఫ్యూచరైజ్-2026 : ఈరోజు ఆలోచన – రేపటి రూపకల్పన' అనే థీమ్‌తో జిల్లా స్థాయి మహోత్సవాన్ని జనవరి 3వ తేదీన నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ పి.సుశీలారాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘన కంభం, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రిక ఈరంకి, చీఫ్ అకడమిక్ హెడ్ సంతోష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపల్ కిరణ్ దేవగిరి చెప్పారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, 2026 జనవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి పాఠశాల ప్రాంగణంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వేగంగా మారుతున్న సాంకేతిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్ విద్యను పునరాలోచించాల్సిన అవసరాన్ని ఫ్యూచరైజ్ ప్రతిబింబిస్తోందని చెప్పారు. విద్యార్థుల్లో భవిష్యత్ నైపుణ్యాలు, వినూత్న ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, విమర్శనాత్మక దృక్పథం పెంపొందించడమే లక్ష్యంగా ఎస్‌టిఇఎం విద్య, కోడింగ్, డిజిటల్ లిటరసీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. అనుభవాత్మక విద్య, వృత్తి అవగాహన, ఎఐ, రెడీ విద్యా విధానాల ద్వారా విద్యార్థులను పరీక్షలకే కాదు, జీవితానికి సిద్ధం చేయడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నారు.

నూర్జహాన్‌కు సత్కారం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలో 15 సంవత్సరాలు పాటు విడిఒ, గ్రామ కార్యదర్శిగా పనిచేసిన నూర్జహాన్‌కు ఘన సత్కారం లభించింది. మండలంలోని పద్మనాభం, కృష్ణాపురం, రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల్లో పనిచేసిన నూర్జహాన్ డిప్యూటీ ఎంపిడిఒగా ప్రమోషన్‌పై కోటవురట్ల మండలానికి ఈ నెల 4వ తేదీన బదిలీ అయ్యారు. ఈ నెల 31న అక్కడ ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఎక్కువకాలం పద్మనాభంలో పనిచేయటం వల్ల ఇక్కడ అధికారులు ప్రజాప్రతినిధులు ఆమెను సత్కరించి, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ నగేష్, తహశీల్దార్ కె.ఆనందరావు, మండల టిడిపి అధ్యక్షులు కె.రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, నాయకులు కె.నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో 5 లక్షలకుపైగా కంటి శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్‌లో 1997 నుంచి ఇప్పటి వరకు 5 లక్షలకుపైగా కంటి శస్త్రచికిత్సలు పూర్తి చేసి ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించినట్లు సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 29 లక్షల మందికిపైగా అవుట్ పేషెంట్లకు చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. తద్వారా ఈ ప్రాంతంలో 'కంటి సంరక్షణలో అగ్రగామి'గా తన కీర్తిని సుస్థిరం చేసుకుందని వివరించారు. శంకర్ ఫౌండేషన్ ప్రారంభం నుండే అందరికీ నాణ్యమైన కంటి సంరక్షణను అందించాలనే దార్శనికతలో స్థిరంగా ఉందని, దృష్టిని పునరుద్ధరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోందని తెలిపారు.

2025 సంవత్సరంలో 29,975 కంటి శస్త్రచికిత్సలు, అదనంగా 5,318 క్లినికల్ ప్రక్రియలు, 2,01,617 మంది అవుట్‌పేషెంట్లకు కంటి పరీక్షలు చేసినట్లు వివరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరాలు

శంకర్ ఫౌండేషన్ అవుట్‌రీచ్ బృందం 2025లో ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లోని పలు గ్రామాలు, నగరాల్లో 603 ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. 43,804 మంది అవుట్ పేషెంట్లకు పరీక్షలు చేసినట్లు వివరించారు. అవుట్రీచ్ కార్యక్రమాల ద్వారా 14,175 కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది సమిష్టికృషితో శంకర్ ఫౌండేషన్ ఈ మైలురాయిని సాధించిందని శంకర్ ఫౌండేషన్ ట్రస్టీల బోర్డు అధ్యక్షుడు ఎం.రామదాస్, మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, ట్రస్టీలు ఎ.ప్రసన్న కుమార్, ఎ.విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది, మొత్తం ఉద్యోగుల అంకితభావాన్ని, పనితీరును ప్రశంసించారు.

బహిరంగ వేలం వాయిదా

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్-5 జ్ఞానాపురం పరిధిలో 2026 జనవరి 7వ తేదీన నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల 8వ తేదీకి వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ బి.రాము ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 8వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలానికి సంబంధించిన వివరాలకు కార్యాలయం పనివేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

సూపర్ సిక్స్‌తో ప్రజలకు మేలు : ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : సూపర్ సిక్స్ పథకాల సూపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా రూ.10,090 కోట్లు విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వికలాంగులు ఎక్కడైనా పింఛను తీసుకునే అవకాశం, అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో నిధులు జమ, దీపం-2 పథకం ద్వారా ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు, ఎన్‌టిఆర్ భరోసా ద్వారా పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఇక నుంచి పెందుర్తి జోన్‌గా...

ప్రజాశక్తి-వేపగుంట : వేపగుంటలోని జివిఎంసి జోన్-8 ఇక పెందుర్తి జోన్‌గా పిలవనున్నారు. గతంలో గ్రేట్ విశాఖ ఎనిమిది జోన్లుగా ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పది జోన్లుగా విభజించాలని నిర్ణయించారు. అందులో భాగంగా జనవరి ఒకటి నుంచి రెండు జోన్లు పెంచారు. గతంలో వేపగుంట జోన్ 8 కాగా ఇప్పుడు పెందుర్తి జోన్‌గా పిలవబడుతుంది. జోనల్ కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో భవనానికి మరమ్మత్తులు చేపట్టారు. భవనానికి విద్యుత్ అలంకరణ, హోర్డింగ్‌లతో మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రారంభానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొంటారు.

ముగిసిన ప్రత్యేక సేవా శిబిరాలు

ముగింపు శిబిరంలో విద్యార్థినులు

ప్రజాశక్తి -ములగాడ : సెయింట్ ఆన్స్ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఈ నెల 24వ తేదీ నుండి ప్రారంభించిన ప్రత్యేక సేవా శిబిరాలు మంగళవారంతో ముగిసాయి. 60వ వార్డులోని జవహర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ యూనిట్- 1 ప్రత్యేక సేవా శిబిర ముగింపు సమావేశానికి సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని వాలంటీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్ సూరీడమ్మ , వాలంటీర్లు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఇందిరా కాలనీలో ఇంటర్మీడియట్ యూనిట్- 2 ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సేవ శిబిరం ముగింపు సమావేశానికి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ ముఖ్యఅతిథిగా హాజరై సామాజిక సేవ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి నదియా, అంగన్వాడీ టీచర్ రాణి, స్థానిక మహిళలు, వాలంటీర్లు పాల్గొన్నారు. 61వ వార్డులోని పల్లి వీధిలో డిగ్రీ కళాశాల యూనిట్- 1 ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు సమావేశానికి వార్డు తెలుగుదేశం అధ్యక్షులు మజ్జి సోమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వాలంటీర్ల ప్రస్తావించిన స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సెయింట్ ఆన్స్ కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధి సిస్టర్ ఫైన్, మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్లు నిర్మల, లలితకుమారి, కనకరత్నం, శాంతి కుమారి పాల్గొన్నారు. ప్రకాష్ నగర్‌లోని గ్రంథాలయంలో నిర్వహించిన డిగ్రీ కళాశాల యూనిట్-2 ప్రత్యేక సేవ శిబిరం ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు, సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, ప్రముఖ సామాజిక కార్యకర్త కెవిఎన్.నరసింహం, ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి పాల్గొన్నారు. వెంకన్నపాలెంలో డిగ్రీ కళాశాల యూనిట్- 3 ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా శిబిర ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా సిస్టర్ క్యాస్లిన్ హాజరయ్యారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి అంజలీదేవి పాల్గొన్నారు. కార్యక్రమాలన్నిటినీ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి సమన్వయ పరిచారు. ఈ ప్రత్యేక సేవా శిబిరాల ద్వారా 500 మందికి ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. 95 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి ఎంపిక చేశారు.

ఇనాం భూములు అమ్ముకునే హక్కు కల్పించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గంలో ఉన్న ఇనాం భూములను అమ్ముకునే హక్కును సంబంధిత రైతులకు కల్పించాలని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి అనుభవంలో ఉన్న ఇనాం భూములను వారి కుటుంబ అవసరాల కోసం అమ్ముకోలేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం : సినీ నటి రోహిణి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

పుస్తకపఠనంతోనే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని, ప్రస్తుత యువత సెల్‌ఫోన్లవి వినియోగంలో పడి పుస్తకాలకు దూరమవుతున్నారని ప్రముఖ సినీ నటి రోహిణి అన్నారు. సిఐటియు 18వ జాతీయ మహాసభలు సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆమె అక్కడి పుస్తక మహోత్సవం, సైన్స్ ఎగ్జిబిషన్, ఫొటో ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

పుస్తకాలకు దూరమవుతున్న యువత

పుస్తక ప్రదర్శనను సందర్శించిన అనంతరం రోహిణి మాట్లాడుతూ ఆధునిక యుగంలో సాంకేతికత పెరిగి యువత ఎలక్ట్రానిక్ పరికరాలకే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పుస్తక పఠనం తగ్గిపోతోందని, ఇలాంటి తరుణంలో ప్రజలను మళ్లీ పుస్తకాల వైపు మళ్లించేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఆమె స్వయంగా పలు పుస్తకాలను పరిశీలించి, వాటి విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు.

ఆలోచింపజేసే కార్టూన్లు

కార్టూన్ ప్రదర్శనను వీక్షించిన రోహిణి, భావవ్యక్తీకరణకు కార్టూన్లు అత్యంత శక్తివంతమైన మాధ్యమాలని పేర్కొన్నారు. గతంలో దినపత్రికల్లో ప్రతిరోజూ కార్టూన్లు వచ్చేవని, కానీ ఇప్పుడు అవి తగ్గుముఖం పట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్త చేశారు. యువత ఈ కళకు కూడా దూరమవుతోందని వ్యాఖ్యానించారు. అనంతరం సైన్స్, ఫోటో ఎగ్జిబిషన్లలోని ప్రదర్శనలను చూసి అక్కడి ప్రత్యేకతలను ఆశ్చర్యంతో వీక్షించారు.

షార్ట్ ఫిలింలే రేపటి పునాది

ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన షార్ట్ ఫిలిం స్క్రీనింగ్‌లో 'జయహే' అనే లఘు చిత్రాన్ని ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా యువ కళాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ 'నేటి తరం దర్శకులందరికీ షార్ట్ ఫిలింలే పునాదన్నారు. యువత కొత్త ఆలోచనలతో చిత్ర నిర్మాణ రంగంలోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రజలు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సినీ నటులు రోహిణి, మాదాల రవి

రాజకీయ దృక్పథంతోనే అభ్యుదయ సాహిత్యం

గురజాడ అజెండాను అమలు చేసి చూపించిన శ్రీశ్రీ

కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

సరైన రాజకీయ దృక్పథం, వర్గదృష్టితోనే అభ్యుదయ సాహిత్యం సాధ్యమవుతుందని ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఇటువంటి ప్రయత్నంలో మహాకవి గురజాడ అజెండా సెట్ చేస్తే శ్రీశ్రీ, కాళీపట్నం రామారావు తదితర కవులు వాటిని మరింత ముందుకు తీసుకెళ్లారని వివరించారు. సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ మైదానంలో శ్రామిక ఉత్సవ్ అనే కార్యక్రమం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన శ్రామిక సాహిత్య వేదికలో 'అభ్యుదయ సాహిత్య భావధార' అన్న అంశంపై అరసం విశాఖ జిల్లా అధ్యక్షులు ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన మంగళవారం చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో రకాల సాహిత్యం ఉన్నప్పటికీ, అభ్యుదయ సాహిత్యం ప్రత్యేకమైందని వివరించారు. ప్రధానంగా ఈ తరహా సాహిత్యం 1930 నుంచి 1955 మధ్య విరివిగా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆ

శ్రమ అవార్డులతో అట్టాడ అప్పలనాయుడు, జయపాలరావు, తదితరులు, చిత్రంలో ఎంవిఎస్.శర్మ

కాలంలో ప్రపంచ దేశాల్లో మారిన పరిస్థితులు, సంఘర్షణ కవులు, రచయితలపై తీవ్ర ప్రభావం చూపడమే ఇందుకు కారణమన్నారు. ఆ కాలంలోనే రష్యాపై దాడి జరుగుతున్న నేపథ్యంలో 'గర్జించు రష్యా... గాండ్రించు రష్యా' అంటూ శ్రీశ్రీ తన కవితలతో ప్రపంచంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను, అందులో మంచి చెడులను జనానికి అర్థమయ్యే రీతిలో చెప్పారని గుర్తు చేశారు. 'ఏడవకండేడవకండి! ... ఏడవకండి.. ఏడవకండి! ఓ వ్యథా నినిష్టులారా! ఓ కథా విశిష్టులారా! పతితులారా! భ్రష్టులారా! బాధాసర్పదష్టులారా! ఏడవకం డేడవకండి! ... జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయి' అంటూ పీడిత ప్రజానీకానికి ఆయన అండగా నిలిచారని కొనియాడారు. చాసో అభ్యుదయ కథలు కూడా జనాల్లోకి బాగా వెళ్లాయన్నారు. శ్రీశ్రీ, చాసోలపై గురజాడ అభ్యుదయ రచనల ప్రభావం ఉండడం వల్ల సమాజాన్ని ప్రభావితం చేయగలిగే కవితలు, రచనలు వీరు చేశారని అన్నారు. వీరితో పాటు అనేకమంది కవులు, రచయితలు తెలుగు నాట అభ్యుదయ సాహిత్యానికి పెద్దపీట వేశారని వివరించారు.

కవి, సాహితీవేత్త డాక్టర్ జివిఎస్ జయపాలరావు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యంలో గురజాడ మానవతావాదాన్ని ఎంచుకుంటే, రష్యా విప్లవం ప్రభావంతో శ్రీశ్రీ మానవహక్కులను ప్రధానాంశంగా తీసుకుని ముందుకు నడిపారన్నారు. రైతులు, కార్మికులు, దళితులు, పేదలు, గిరిజనుల ఈతి బాధలు, ఆశలు, ఆకాంక్షలు వీరిద్దరి అభ్యుదయ సాహిత్యంలో ఉన్నాయన్నారు. స్వాతంత్ర్య అనంతరం, ప్రజాస్వామ్య విలువలు, లౌకిక, శాస్త్రీయ దృక్పథం వంటి భావాలు కూడా అభ్యుదయ సాహిత్యంలో ఇమిడిపోయాయన్నారు. సమకాలీన పరిస్థితుల్లో అభ్యుదయ సాహిత్యం కొత్తరూపంలో కొనసాగుతోందన్నారు. గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, కార్పొరేట్ సంస్కృతి వంటి ఆధునిక భావాల్లో లోపాలను కూడా ఇది ప్రశ్నిస్తోందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఉటంకిస్తూ "ప్రస్తుతం పాలకుల యొక్క భావజాలం... పులిరాజు భావజాలం.. గొంగడి పురుగు చిత్ర విచిత్ర వేషాలు.. అల్పబుద్ధి కోతుల విన్యాసాలు.. ఊసరవల్లి పార్టీల మార్పులు.. గొర్రెల మందకు చెప్పే తోడేళ్ల కబుర్లు... గాలివార్తలు వెదజల్లే పిల్లులు... నేటి రాజకీయంలో నాయకుల అవసరాలు... అంటూ రాజకీయ ముసుగులో చేస్తున్న స్వార్థాన్ని వివరించారు. ఈ తరుణంలో సమాజానికి అభ్యుదయ సాహిత్య అవసరం ఎంతో ఉందన్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా పుట్టిన అది అంతమయ్యే వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం అరసం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు సర్వసిద్ధి హనుమంతరావు మాట్లాడారు. వీరికి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ చేతులమీదుగా శ్రమ అవార్డులు ప్రదానం చేశారు.

లఘు చిత్రాలు.. పెద్ద సందేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

సిఐటియు 18వ జాతీయ మహాసభలు సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నాలుగో రోజు మంగళవారం ప్రదర్శించిన లఘు చిత్రాలు సామాజిక చైతన్యాన్ని, సమకాలీన సమస్యలను ఎంతో శక్తివంతంగా ఆవిష్కరించాయి. ప్రముఖ నటీనటులు రోహిణి, మాదాల రవి ఈ చిత్రాలను ప్రత్యక్షంగా వీక్షించి లఘు చిత్ర దర్శకులను అభినందించారు. మంగళవారం జరిగిన ప్రదర్శనలో 7 చిత్రాలు ప్రదర్శించారు.

'ఇది ఆరంభం' షార్ట్ ఫిల్మ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రోహిణి, మాదాల రవి

◆ విశాఖపట్నంకు చెందిన శంకర్ దర్శకత్వం వహించిన మై ఓటు నాట్ ఫర్ సేల్ లఘు చిత్రం ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం. కానీ నేటి రాజకీయాల్లో ఓటును నోటుకు అమ్ముకోవడం వల్ల ప్రజలు తమ ఐదేళ్ల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారో ఈ చిత్రం కళ్లకు కట్టినట్లు చూపించింది.

◆ విశాఖపట్నం కు చెందిన సుదీప్ సాయి దర్శకత్వం వహించిన లఘు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై తీసిన ఈ చిత్రం ప్రస్తుతం ఎంతో ప్రాధాన్యత కలిగింది. స్టీల్ ప్లాంట్ కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదు, వేలాది కుటుంబాల జీవనాధారం, విశాఖ ప్రజల ఆత్మగౌరవం అని ఇందులో వివరించారు.

◆ విఎస్ఎఫ్ఎం నిర్మించిన 100వ అల్లూరి లఘు చిత్రంలో అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంత అవసరమో ఈ చిత్రం చాటిచెప్పింది. కేవలం చరిత్ర పుస్తకాల్లోనే కాకుండా, నేటి అన్యాయాలపై గొంతెత్తే ప్రతి ఒక్కరిలోనూ అల్లూరి ఉండాలని ఉద్బోధించింది.

◆ విశాఖపట్నం కు చెందిన కె.మహేష్ బాబు దర్శకత్వం వహించిన అన్సంగ్ హీరోస్ లఘు చిత్రం మన నగరాన్ని శుభ్రంగా ఉంచే మున్సిపాలిటీ వర్కర్ల (పారిశుధ్య కార్మికుల) జీవితాలను చిత్రీకరించిన డాక్యుమెంటరీ ఇది. వారు పడుతున్న ఆరోగ్య సమస్యలు, సామాజిక వివక్ష మరియు వారి నిస్వార్థ సేవను ఇందులో చూపారు.

◆ ఫ్యుబె క్రియేషన్ నిర్మాణం రూపొందించిన ఎఫ్-2 లఘు చిత్రం నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న నేటి యువత ప్రతినిధిగా ఒక యువకుడి పాత్రను ఇందులో చూపారు. చదువు పూర్తి చేసి ఉద్యోగం కోసం అతను పడే ఆవేదన, ఎదుర్కొనే సవాళ్లు ప్రతి నిరుద్యోగిని ఆలోచింపజేస్తాయి.

◆ విశాఖపట్నంకు చెందిన పి.రమేష్ కుమార్ దర్శకత్వం వహించిన జయహే లఘు చిత్రం మత సామరస్యంపై తీసిన సందేశాత్మక చిత్రం. కుల, మతాల కంటే మానవత్వం గొప్పదని, వైవిధ్యంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో అంతా కలిసి ఉండాలని ఈ చిత్రం ప్రబోధించింది.

◆ చివరగా విశాఖపట్నం కు చెందిన దామోదర్ దర్శకత్వం వహించిన యుద్ధం ప్రకటించు లఘు చిత్రం యువతను పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య 'మత్తు' మాయదారి మత్తులో పడి జీవితాలను ఎలా పాడుచేసుకుంటున్నారో చూపిస్తూ, ఆ అలవాట్లపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చింది.

◆ ప్రదర్శన అనంతరం "ఇది ఆరంభం" అనే షార్ట్ ఫిలిం పోస్టర్‌ను రోహిణి, మాదాల రవి ఆవిష్కరించారు. భవిష్యత్తులో కార్మిక, సామాజిక సమస్యలపై మరిన్ని చిత్రాలు రాబోతున్నాయని అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ చిత్రాలన్నీ కేవలం కళాఖండాలుగా మాత్రమే కాకుండా, సమాజాన్ని మార్చే ఆయుధాలుగా నిలుస్తాయని తెలిపింది.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
బుధవారం 31 డిసెంబర్ 2025

ప్రధాన వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత

ఉత్సాహం.. ఉత్తేజం

సందడిగా శ్రామిక ఉత్సవ్

నాలుగో రోజూ జనతాకిడి

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

శ్రామిక ఉత్సవ్‌తో సాగర తీరం ఉప్పొంగుతోంది. సాంస్కృతిక కళారూపాలు, సైన్స్, ఫొటో, కార్టూన్ ఎగ్జిబిషన్లతో కళకళలాడుతోంది. పుస్తక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సిఐటియు అఖిల భారత మహాసభ బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే ఆ కార్మిక పండగకు సమస్త కార్మిక వర్గాన్ని శ్రామిక ఉత్సవ్ కదిలించింది. మంగళవారం విశాఖ సాగర తీరంలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు ఎర్ర సముద్రాన్ని తలపించింది.

CITU
18TH ALL INDIA CONFERENCE

డ్యాన్సులతో ఆకట్టుకున్న చిన్నారులు

మహాసభ జరిగే ఎయు కన్వెన్షన్ సెంటర్ వద్ద రెడ్‌షర్ట్ వాలంటీర్లు

రెడ్ షర్ట్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు మురళి

సాగర తీరంలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు

ఇతర రాష్ట్రాల నుంచి విచ్చేసిన వారికి సమాచారం తెలియజేస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి
-భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో మంగళ వారం సాయంత్రం ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహించిన కార్మికుల పండగ నాలుగో రోజు మంగళవారం అదే ఉత్సాహం, చైతన్యం తో సాగింది. నాగభైరవ కోటేశ్వర రావు రాసిన ప్రజానాట్య మండలి కళాకారులు అప్పన్న ఆధ్వర్యంలో కళాకారులు పాడిన "ఇదే ఇదే నా దేశం... ఇదే ఆంధ్ర దేశం, తరతరాల చరిత్ర లో తనిసిన సందేశం' ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

'పల్లె పల్లెలో ఎగురే ద్దాం ఎర్ర జెండా.. గల్లిగల్లి లో ఎగురేద్దాం ఎర్ర జెండా' అంటూ ఆశా కార్యకర్తల కోలాటం ఆలోచింప జేసింది.

రాజేశ్వరి బృందం చిన్నారులు ప్రదర్శించిన క్లాసికల్ డాన్స్ అబ్బురపరిచింది. అంగన్వాడీ ఉద్యమాన్ని ఉదహరిస్తూ జగన్ పాడిన 'పట్టు పట్టక్క.. జెండా పట్టక్క.. సిఐటియు నీకు నాకు అండ దండక్క' పాట సిఐటియు విశిష్టతను

ఒక్కో కళారూపం.. ఎంతో ప్రత్యేకం..

అన్న పాట సభికులను ఉత్సాహ పరిచింది. శాతవాహనుల శౌర్యం, కాకతీయుల సంగ్రామం, త్యాగరాజు గానం తదితర అంశాలను జోడించి పాడిన పాట ఆలోచింప జేసింది. హంపి, అమరావతి, గోదావరి, కష్ణవేణి కూచిపూడి నృత్యం .. సంస్కతి సౌరభం వెల్లివిరిసిన నేపథ్యాన్ని ఈ పాటలో పొందుపరిచారు.

విశాఖ జివిఎంసి డప్పు కళాకారుల "తీన్ మార్"ఆకట్టుకుంది.

గాయకులు పెద్ది రాజు అధ్వర్యంలో కళాకారులు పాడిన "రగిలి పోయే ఉద్యమాల జ్వాల, ఇది తెల్ల దొరలనే తరిమేసిన నేల " పాటలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు కొత్తేమీకాదని, నిలదీసే గొంతును నొక్కేసినా, ప్రశ్నించే వారిని భయపెట్టినా ఉద్యమాలు ఆగవని వివరించే ప్రయత్నం చేశారు. దేవేంద్ర రాసిన 'తెలుగు భాష ఆకాశంలో పున్నమి చంద్రుడు గురజాడ' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు చంటి పాడిన పాట తెలుగు భాష వివరించారు.

చింతల యాదగిరి రాసిన 'పద పద రా భగత్ సింగ్ వారసుడా, యువ భారత నవ శక్తి కి నాయకుడా' అంటూ ఏలూరు జిల్లా కళాకారుల బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ త్యాగాన్ని వివరించారు. భగత్ సింగ్ అసమానమైన త్యాగం, ఆయన ఆలోచన స్వేచ్ఛకు సంకేతం అంటూ కళాకారులు వివరించారు.

ఏటుకూరి ప్రసాద్ రాసిన 'ఇదే ఎర్ర బాటరా.. ఇదే వెలుగు బాటరా' అంటూ కళాకారులు పాడిన పాట ఎర్ర జెండా ప్రాధాన్యత, విశిష్టత ను వివరించారు. ఎర్ర జెండా పుట్టింది త్యాగాల కొలిమిలో.. అంటూ కళాకారులు ఎర్ర జెండా ప్రాధాన్యత ను వివరించారు.

విప్లవ మార్గం అంటే పూల మార్గం కాదురా.. మార్క్స్, లెనిన్ సిద్ధాంతం భావ కవిత కాదురా .. అంటూ కళాకారులు పాడిన పాట ఆలోచింపజేసింది.

శ్రామిక ఉత్సవ్‌కు విచ్చేసిన కళాకారులు, విద్యార్థులు

రోహిణి, మాదాల రవికి జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

మహిళల నృత్య ప్రదర్శన

ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

మద్యపానం అనర్థాలపై కళారూపం

కళారూపాలను వీక్షిస్తున్న నగర ప్రజానీకం

విప్లవ గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

చైతన్యం రగిలించిన రైస్‌మిల్లు కార్మికుల పోరాటాలు

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రైసు మిల్లు కార్మికుల పోరాటాలు విస్తృతంగా సాగాయి. మందస, కోటబొమ్మాళి వంటి ప్రాంతాల్లో చేపట్టిన పోరాటాలు మిగిలిన ప్రాంత కార్మికుల్లో చైతన్యం రగిలించాయి. పనికి వెళ్తే గానీ పూట గడవని స్థితిలో ఉన్నా ఆయా ప్రాంతాల కార్మికులు నెల రోజులకు పైగా సమ్మె చేసి తెగువ ప్రదర్శించారు. పనిలో నుంచి తీసేస్తామన్నా వెరవలేదు. స్థానిక రాజకీయ నాయకులు బెదిరించినా వెనక్కి తగ్గలేదు. తాము అనుకున్న కూలిరేట్లను పెంచుకున్నారు. తమ పోరాట స్ఫూర్తితో ఇతర మిల్లుల్లోని కార్మికులు ఆందోళనకు దిగాల్సిన పని లేకుండానే యజమాన్యాలు కూలి రేట్ల పెంపునకు అంగీకరించేలా చేయగలిగారు.

మందస ప్రాంతంలోని సారంగిపురం, రామకృష్ణాపురం పరిసర గ్రామాల్లోని రైస్‌మిల్లుల్లో సుమారు వంద మంది కార్మికులు పనిచేస్తున్నారు. రెండేళ్లకోసారి కూలి రేట్ల ఒప్పందాన్ని సవరించాల్సిన మిల్లు యజమానులు ఒప్పంద కాలపరిమితి దాటినా పెంచేందుకు అంగీకరించలేదు. దీనిపై మిల్లు కార్మికులు పలుమార్లు యజమానుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. దీంతో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనలకు సమాయత్తమయ్యారు. కార్మికులు మానేసినా ఫర్వాలేదనుకున్న యజమానులు వారి డిమాండ్లను అంగీకరించలేదు. దీంతో వారు ఆందోళనలను ఉధృతం చేశారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన స్థానిక వైసిపి నాయకులు యజమానుల పక్షం వహించారు. రాజకీయ జోక్యం చేసుకుని కూలి రేట్లు తగ్గించడానికి సైతం ప్రయత్నించారు. అంతా ఏకమైనా వారు తమ పోరాటాలను ఆపలేదు. 2023 డిసెంబరులో 42 రోజుల పాటు సమ్మె చేశారు. దీంతో అధికార యంత్రాంగం జోక్యం చేసుకుని 34 శాతానికి పెంచడానికి ఒప్పుకున్నారు.

బెదిరింపులకు దిగినా వెరవని కార్మికులు

కోటబొమ్మాళి ప్రాంతంలోని రైస్‌మిల్లు కార్మికులు ఇదే తరహాలో పోరాటం సాగించారు. వీరు కూడా 40 రోజుల పాటు సమ్మెకు దిగారు. ఇక్కడ ఏకంగా అధికారులే బెదిరింపులకు దిగారు. కార్మికులపై అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రయోగిస్తామంటూ ఆర్‌డిఒ సైతం హెచ్చరించారు. బెదిరింపులకు వెరవని కార్మికులు తమ సమ్మె కొనసాగించారు. పరిస్థితి చేయిదాటిపోతుండడంతో కార్మికశాఖ అధికారులు జోక్యం చేసుకుని చర్చలు జరిపారు. రైస్‌మిల్లుల్లో చేసే పలురకాల పనులపై 26 శాతం పెంచేందుకు అంగీకరించాయి. కార్మికుల పోరాట ఫలితంగా కార్మికులకు రూ.4,200 బోనస్ దక్కింది. వేళాపాళా లేకుండా పనిచేయించుకున్న పరిస్థితి నుంచి నిర్దిష్ట పనివేళల్లోనే పనిచేసేలా ఒప్పందం సాధించుకున్నారు.

డిమాండ్ నోటీసులతోనే దారికొచ్చిన యజమానులు

కోటబొమ్మాళిలో ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

పాలకొండ, రాజాం ప్రాంతాల్లోని రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులు కూలి రేట్ల పెంపునకు సిఐటియు అండతో అనేక పోరాటాలు సాగించారు. పాలకొండ మండలం కొమరాడ, అన్నవరం తదితర మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు పీస్ రేట్ పెంపుపై కార్మికులు ఆయా యజమానులకు డిమాండ్ నోటీసులు ఇచ్చాయి. ఆందోళనలకు అవకాశం ఇవ్వకుండా డిమాండ్ నోటీసులతోనే యజమానులు దారికొచ్చారు. పలురకాల కూలి పనులపై 29 శాతం పెంచేందుకు అంగీకరించారు. రాజాం మండలంలోని రాజాం, బలిజపేట తదితర ప్రాంతాల్లోని 22 మిల్లులోని కార్మికులకు పెంపు రేటు ప్రయోజనాన్ని దక్కించుకున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లోని రైస్ మిల్లు కార్మికులు మిల్లులను స్తంభింపచేయడంతో లేనిపోని రచ్చ ఎందుకని యజమానులు డిమాండ్ నోటీసులతోనే వారి పీస్ రేట్లను పెంచేందుకు అంగీకరించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ ప్రాంతంలోని కార్మికులు ఎటువంటి పోరాటాలు లేకుండానే డిమాండ్ నోటీస్ ఇచ్చిన వెంటనే పెంపునకు యజమానులు అంగీకరించారు. మిల్లులో చేసే పని ఆధారంగా 26 శాతం పెంపు రేటు దక్కించుకున్నారు. పోలాకి మండలం పిన్నింటిపేటలో కార్మికులు 26 శాతం రేటు సాధించుకున్నారు.

పోరాటంతోనే నిలబడిన బిహెచ్‌పివి

ప్రజాశక్తి – విశాఖపట్నం

కేంద్ర ప్రభుత్వం 1991లో తెచ్చిన నూతన ఆర్థిక విధానాలతో విశాఖలో బిహెచ్‌పివి కష్టాల్లో పడింది. వర్క్ ఆర్డర్ రాకపోవడం, ఎల్‌అండ్‌టి వంటి పరిశ్రమలు పోటీకి రావడంతో ఈ పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడింది. కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి దాపురించింది. 1966 జూన్ 25న బిహెచ్‌పివి ఏర్పాటుకు అప్పటి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 4000 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేసేవారు. నూతన ఆర్థిక విధానాల తర్వాత బిహెచ్‌పివి పరిస్థితి దిగజారుతూ వచ్చింది. పిఎఫ్ లోనులు ఇచ్చేవారు కాదు. కో–ఆపరేటివ్ సొసైటీలు దివాళా తీశాయి. 2001లో సిఐటియు, ఐఎన్‌టియుసి ఫ్రాక్షన్, బిహెచ్‌పివి ఎంఎస్ ఫ్రాక్షన్ కలిసి ఉమ్మడిగా యూనియన్ ఎన్నికల్లో పోటీచేశాయి. గౌరవాధ్యక్షులుగా సిహెచ్.నర్సింగరావు గెలిచారు. ఆ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు ఓడిపోయారు. ఈ కాలంలోనే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కంపెనీలో పెద్ద పోరాటాలు జరిగాయి. కుటుంబాలతో సహా పోరాటంలోకి వచ్చారు. ఆనాడు కేంద్రంలోఉన్న వాజ్‌పేయ్ నేతృత్వంలోని బిజెపి, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వాల నుంచి సహాయం అందలేదు. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో బేరసారాలు జరిపింది. బిహెచ్‌పివిని కొనుగోలు చేయడానికి ఎల్ అండ్ టి కంపెనీని అధికారికంగా కేంద్రం పంపించింది. బిహెచ్‌పివిలోకి ఎల్ అండ్ టి కార్మికుల రాకను కార్మికులు వ్యతిరేకించారు. వచ్చిన వారిని వచ్చినట్లుగా కార్మికులు వెంటబడి తరిమికొట్టారు. ఎల్ అండ్ టి అధికారులు పలాయనం చిత్తగించారు. కేంద్రంలో ఉన్న వాజ్‌పేయ్ ప్రభుత్వం ప్లాన్ మార్చుకొని ఎల్ అండ్ టి నుంచి ఒక అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసి బిహెచ్‌పివికి పంపించింది. వచ్చిన ఎమ్‌డి కర్మాగారానికి వర్క్ ఆర్డర్లు తేకుండా, కార్మికులకు పని లేకుండా కుట్రకు పూనుకున్నాడు. ఎమ్‌డి మోసాన్ని సిఐటియు గుర్తించి మే డే రోజున జెండా ఎగురవేసి, మేనేజింగ్ డైరెక్టర్ గోబ్యాక్ నినాదాన్ని ఇచ్చిది. హైవే నుంచి బిహెచ్‌పివి అడ్మిన్ బిల్డింగ్ వరకు ప్రదర్శన చేసింది. పెద్దపెట్టున నినాదాలతో నిరసన చేపట్టింది. ఎమ్‌డిని బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. అప్పటి నుంచి ఉద్యమం ఊపందుకుంది. కొన్ని నెలలకు ఎమ్‌డి రాజీనామా చేసి వెళ్లి పోయాడు. ఆ సమయంలో దేశంలో ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో టిడిపి ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలో వామపక్షాల సహకారంతో యుపిఎ–1 ప్రభుత్వం ఏర్పాటైంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బిహెచ్‌పివి టౌన్‌షిప్ స్థలం కొంత భాగం అమ్ముకొని

అప్పులు తీర్చుకొని కర్మాగారం నడుపుకోవచ్చు కదా అని సలహా ఇచ్చింది. దీన్ని సిఐటియు వ్యతిరేకించింది. పోరాడింది. సీతారాం ఏచూరి జోక్యంతో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం భెల్‌లో విలీనం చేయడానికి అంగీకరించింది. ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి 2018 మే 10న బిహెచ్‌పివిని భెల్ యాజమాన్యం టేకోవర్ చేసుకుంది. ఇప్పుడు మహరత్నగా కొనసాగుతోంది. భెల్ 17వ యూనిట్‌గా ఉంది.

బిహెచ్‌పివికి కూతవేటు దూరంలో ఉన్న హిందూస్తాన్ జింక్ పరిశ్రమ 1977 మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభించి బాగా నడిచింది. కేంద్రంలోని వాజ్‌పేయ్ ప్రభుత్వం జింక్ పరిశ్రమను ప్రయివేటు సంస్థ అయిన వేదాంతకు అప్పగిచ్చింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా యూనియన్ ప్రతిఘటించినా దీర్ఘకాలం కొనసాగలేదు. ప్రయివేటీకరణ ఫలితంగా ప్రస్తుతం ఆ పరిశ్రమ మూతపడింది.

గణనీయంగా తగ్గిన నేరాల రేటు

సాంకేతికతతో విజయవంతంగా నేర పరిశోధన

జిల్లా వార్షిక నేర నివేదిక వెల్లడించిన ఎస్‌పి సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 2025 సంవత్సరంలో నేరాలరేటు గణనీయంగా తగ్గిందని, అదే సమయంలో సాంకేతికత సాయంతో నేరపరిశోధన విజయవంతంగా చేపట్టి, పలు కేసులను సులభంగా చేధించామని జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియా సమావేశంలో గతేడాది వార్షిక నేర గణాంకాలు, సాధించిన ప్రగతిని వెల్లడించారు. ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే 2025లో జిల్లాలో నేరాలరేటు 23శాతం మేర తగ్గాయన్నారు.

మహిళలు, చిన్నారులపై నేరాలు తగ్గుదల

మహిళలపై నేరాలు గత ఏడాది 387 ఉండగా, ఈ ఏడాది 291కి తగ్గి 25శాతం క్షీణత నమోదైందన్నారు. చిన్నారులపై పోక్సో కేసులు 44 నుండి 43కి స్వల్పంగా తగ్గాయన్నారు. తీవ్రమైన, ప్రాణహాని కలిగించే నేరాలు, 591 నుంచి 417కి 29శాతం తగ్గాయని, ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసులు గణనీయంగా 54శాతం మేర తగ్గుముఖం పట్టాయన్నారు. హత్యానేరాలు 2024లో 17 కేసులు నమోదైతే, 2025 లో 11 కేసులు 35శాతం తగ్గాయన్నారు. అయితే ఆస్తి వివాదాలు, ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు మూడుశాతం స్వల్ప వృద్ధితో 406 నుండి 417కి పెరిగాయన్నారు మోసపూరిత కేసులు 131 నుండి 125కి (-5శాతం), నమ్మకద్రోహం కేసులు 18 నుండి 17కి (-6శాతం) స్వల్పంగా తగ్గాయన్నారు. ఈ ఏడాది మూడు రికవరీ మేళాల ద్వారా రూ. 3.70 కోట్లు విలువైన 1,880 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందించామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు 7శాతం, క్షతగాత్రులైన ప్రమాదాలు 12శాతం తగ్గాయన్నారు. మాదకద్రవ్యాల కేసులను 162 నుండి 128కి (-21శాతం), ఇతర సాధారణ కేసులు 4,987 నుండి 3,627కి తగ్గి 27శాతం తగ్గుదల నమోదు చేశాయన్నారు. మొత్తంగా 2024లో 7,573 కేసులతో పోలిస్తే, 2025లో 5,821కి తగ్గిందని వెల్లడించారు.

స్వల్పంగా పెరిగిన సైబర్ నేరాలు

ఇతర విభాగాల్లో నేరాలు తగ్గుతున్నప్పటికీ, సైబర్ నేరాలు మాత్రం 61 నుండి 76కి పెరిగి 25శాతం పెరగడం ఆందోళనకరమన్నారు. సోషల్ మీడియా వేధింపుల కేసులు 19 నుండి 21కి (11శాతం) పెరిగాయన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

తగ్గిన మహిళలపై నేరాలు

మహిళలపై జరుగుతున్న నేరాలు గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా కిడ్నాప్ కేసులు 85శాతం, వరకట్న వేధింపులు 11శాతానికి తగ్గాయి. 2025లో 291 మహిళా నేరాల కేసులు నమోదుకాగా వీటిలో 316 మిస్సింగ్ కేసుల్లో 257 మందిని సురక్షితంగా గుర్తించామన్నారు. వీరిలో 149 మంది మహిళలు, 42 మంది బాలికలు ఉన్నారు.

నేర పరిశోధనలో విశేష ప్రతిభ

ఈ ఏడాది రెండు సవాల్‌తో కూడిన హత్య కేసులను పోలీసులు ప్రతిభావంతంగా ఛేదించారు. సబ్బవరంలో అపరిచిత మహిళ హత్య కేసులో బాటజంగాలపాలెం వద్ద దహనం చేయబడిన మహిళా మృతదేహాన్ని గుర్తించి, 450 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషణ ద్వారా నిందితులను (మతురాలి అల్లుడు తదితరులు) 11 రోజుల్లోనే అరెస్ట్ చేశామన్నారు. అలాగే కశింకోట ట్రాన్స్‌జెండర్ హత్య కేసులో నిందితుడిని కాల్ డేటా, టవర్ లోకేషన్ ఆధారంగా కేవలం 24 గంటల్లోనే గుర్తించి అరెస్ట్ చేశామన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠినచర్యలు

గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణలో జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరించారు. 2025లో 128 కేసులు నమోదు చేసి, 411 మందిని అరెస్ట్ చేశారు రూ. 4.41 కోట్ల విలువైన 8790.88 కిలోల గంజాయిని, 7.39 లీటర్ల హషీష్ ఆయిల్, 115 వాహనాలను స్వాధీనం చేశామన్నారు. ఆరుగురు గంజాయి నిందితులకు చెందిన రూ.1.25కోట్ల ఆస్తులను ఫ్రీజ్ చేశారు.. 312 మంది గంజాయి నేరస్థులపై సస్పెక్ట్ షీట్ తెరిచారు. లోక్ అదాలత్ ద్వారా 16,132 కేసులను పరిష్కరించామన్నారు. గంజాయి అక్రమ రవాణా, హత్య, ఫోక్సో కేసుల్లో శిక్షలు, కన్విక్షన్ కేసులు 51శాతం ఉన్నాయన్నారు. ఒక కేసులో మరణశిక్ష, రెండు కేసుల్లో జీవిత ఖైదు, రెండు కేసుల్లో నిందితులకు 20ఏళ్ల జైలు, 10 కేసుల్లో నిందితులకు పదేళ్ల జైలు, ఐదు 5 కేసుల్లో ఐదేళ్ల కంటే ఎక్కువగా జైలు శిక్షలు నిందితులకు విధించారు.హోటళ్లు, లాడ్జీలలో బస చేసే వారి వివరాలను నేరస్తుల డేటాబేస్‌తో సరిపోల్చేందుకు యాప్‌ను ప్రవేశపెట్టామని, జిల్లాలో కొత్తగా 3573 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, సాంకేతికత సహాయంతో 41 కేసులు, వేలిముద్రల ద్వారా 58 కేసులు ఛేదించారన్నారు. అచ్యుతాపురం, పరవాడ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు, అత్యవసర సహాయం కోసం ప్రత్యేకంగా 'జియో-ట్యాగ్డ్ రిసోర్స్ మ్యాపింగ్' డ్రోన్ల వినియోగాన్ని అమలు చేస్తున్నామన్నారు .జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డిఎస్‌ఫిలు జి.ఆర్.ఆర్.మోహన్, ఈ.శ్రీనివాసులు, బి.మోహనరావు, ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, ట్రైనీ డిఎస్‌పి కృష్ణ చైతన్య, పరిపాలన అధికారి తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, వెంకటనారాయణ, ప్రేమ్ కుమార్, అశోక్ కుమార్, స్వామి నాయుడు, దేముళ్ళు, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, శిరీష, అంజిబాబు, విశ్వనాథం, సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు నిషేధించాలి : ఐద్వా

జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 30, 31తేదీలతోపాటు వచ్చేనెల ఒకటిన మూడురోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించాలని ఐద్వా నేతలు కోరారు. మంగళారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి వి సుధీర్‌ను కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం సెక్రటరీ డిడి వరలక్ష్మి, జాయింట్ సెక్రెటరీ ఆర్ లక్ష్మి, జిల్లా జాయింట్ సెక్రెటరీ అన్నపూర్ణ, జాయింట్ సెక్రెటరీ బంగారమ్మ మాట్లాడుతూ నూతన సంవత్సరాది ప్రజలకు ఆనందమయంగా ఉండాలంటే మద్యం అమ్మకాలు నియంత్రించాలన్నారు. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు, ఆకతాయి చేష్టలు, మహిళల పట్ల దురుసు ప్రవర్తన వంటివి లేకుండా ఉండాలంటే అధికారిక మద్యం దుకాణాలను మూడు రోజులపాటు మూసేయడంతోపాటు, బెల్ట్‌షాపులపై నిఘా పెట్టాలన్నారు. కొత్త సంవత్సరం విషాదమయంకాకుండా అందరూ ఆనందంగా గడపాలంటే మద్యాన్ని దూరంగా ఉంచాలని కోరారు.

వాలీబాల్ పోటీల్లో జయవర్ధన్ సత్తా

ట్రోఫీతో జయవర్ధన్

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : ఈనెల 27 వ తేదీనుండి మూడు రోజులపాటు గుంటూరు జిల్లా పొన్నూరులో బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో ఎస్‌విఎస్ కళాశాల విద్యార్థి పి జయవర్ధన్ సత్తా చాటినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రాపర్తి రాము తెలిపారు. డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఏటికొప్పాక గ్రామానికి చెందిన పి జయవర్ధన్ పాల్గొన్న జట్టు వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి, రూ. 30 వేల నగదు, ట్రోపిని సొంతం చేసుకుంది. జయవర్ధన్‌ను ప్రిన్సిపల్‌తోపాటు కాలేజీ అధ్యాపకులు నూకరాజు, ప్రకాష్, రమేష్, జగన్నాథం తదితరులు అభినందించారు.

గెడ్డ ఆక్రమణలపై పరిశీలన

ఇరువాడలో గెడ్డ ఆక్రమణలపై విచారణ చేస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి. -సబ్బవరం : మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 103,106 లలో ప్రభుత్వ గెడ్డవాగు భూమి ఆక్రమణ ఆరోపణలపై కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్‌లో అందిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తహశీల్దార్ బి.చిన్నికృష్ణ మంగళవారం పరిశీలన జరిపారు.. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇరువాడలో ప్రభుత్వ గెడ్డవాగు స్థలం మూడు ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. ఈ స్థలాన్ని ప్రభుత్వపరంగా త్వరలో స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్వేయరు ఎల్. అప్పారావు, విలేజ్ సర్వేయరు రాపర్తి శ్రీనివాసరావు, విఆర్ఒ రామ అప్పారావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు బలిరెడ్డి అప్పారావు, గ్రామ జనసేన అధ్యక్షుడు బలి రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత

మాట్లాడుతున్న మాజీ ఎంపీ చలపతిరావు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2025లో ప్రజారంజక పాలన సాగించిందని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, యువనేత లోకేష్ సారథ్యంలో ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారంలో ముందంజలో ఉన్నామన్నారు. కొత్త సంవత్సరంలోనూ ప్రజలకు మంచిపాలనను కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ప్రజలకు కొత్తసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొర్లి శివన్నారాయణ మూర్తి, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవి, యూనిట్ ఇంచార్జ్ కొత్తలంక రాజేష్ పాల్గొన్నారు.

కస్పా కాలువకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాది కస్పా కాలువ నీటిని మంగళవారం నీటి సంఘం అధ్యక్షుడు మంచాల గోవింద విడుదల చేశారు. వడ్డాది పరిసర ప్రాంతాల రైతులకు చెందిన 1600 ఎకరాల ఆయకట్టుకు రెండో పంటకు నీటిని విడుదల చేశారు. బుచ్చయ్యపేట, వడ్డాది, బంగారు మెట్ట, ఎల్‌బి అగ్రహారం గౌరీపట్నం చిన్నప్పనిపాలెం దిబిడి రైతులకు రబీ వరి పంటకు నీటిని విడుదల చేయడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి కార్యకర్తలకు ఉత్తమ సేవా పురస్కారాలు

ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాబ్జి

ప్రజాశక్తి - పరవాడ : గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన మండలంలోని 16మంది టిడిపి కార్యకర్తలకు మంగళవారం ఉత్తమ సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. పెందుర్తి టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి అవార్డు గ్రహీతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమన్నారు. తానాం గ్రామానికి చెందిన వర్రీ వసంతరావు, గోరుపూటి సింహాచలం నాయుడు, దుంగల రమణ, భరణికం గ్రామం నుంచి నేతల సోమేశ్వరరావు, పరవాడ గ్రామం నుంచి పైల సన్యాసినాయుడు, పైల ప్రసాద్, లాలం హేమంత్ కుమార్, పి. బోనంగి గ్రామం నుంచి జనార్దనరావు లాలం, దుర్గాప్రసాద్ గొంతెన, చీపురుపల్లి గ్రామం నుంచి గండి శ్రీనివాసరావు, ఎం.ఎం. నాయుడు, నాయుడుపాలెం గ్రామం నుంచి గంగునాయుడు కూండ్రపు, ముత్యాలనాయుడు గెడ్డం, అప్పారావు చుక్క, ముత్యాలమ్మపాలెం గ్రామం నుంచి ఆర్జిల్లీ అప్పలరాజు, పెద ముసిడివాడ గ్రామం నుంచి నారపిన్ని సంతోష్ కుమార్‌లకు ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కన్నూరు వెంకటరమణ, గొర్లి కనకారావు పాల్గొన్నారు.

మంచి నడవడికతో ఉత్తమ జీవనం

మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-కె. కోటపాడు: విద్యార్థి దశ నుంచే మంచి నడవడికతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని స్థానిక సిఐ పి.పైడపునాయుడు విద్యార్థులకు హితవు పలికారు. మంగళవారం నిషా ముక్త్ భారత్ కార్యక్రమంలో డ్రగ్స్ దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ , అయ్యన్న డిగ్రీ కాలేజీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, మత్తు జోలికి పోయి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్‌తో విద్యార్థులు, యువత భవిష్యత్తు నాశనం కావడంతోపాటు వారి కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నేరమయం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎ. కోడూరు, కె.కోటపాడు ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, డి ధనుంజయ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు సత్కారం

సూర్యనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం :జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చోడవరానికి చెందిన చీపురుపల్లి సూర్యనారాయణ నియామకంకాగా, మంగళవారం కోర్టులో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం పిపి సూర్యనారాయణను స్థానిక ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్ రాజు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రాజు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గూనూరు మల్లు నాయుడు, న్యాయవాదులు కే డేవిడ్, గౌరీ శంకర్, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీకి రెవెన్యూ శాఖ సిద్ధమైంది. ఈ మేరకు జనవరి 2 నుంచి 9 వరకు మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి పాస్‌బుక్స్ అందజేయనున్నట్లు తహశీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 2న కాశీపురం, కాశీపతిరాజుపురం, నాగయ్యపేట, సీతంపేట, 3న బోయిలకింతాడ, కలిగొట్ల, 5న చిన సోంపురం, జుత్తాడపాలెం, వల్లపుకోడాబు, పెదసోంపురం, తామరబ్బ, చేనులపాలెం, శివరామ చేనులపాలెం, మారేపల్లి, జనవరి 6న ఎ.కొత్తపల్లి, ఎం.అలమండ, 7న చినగంగవరం, గరిసింగి, రైవాడ, పెదనందిపల్లి, 8న చిననందిపల్లి, ములకలాపల్లి, మామిడిపల్లి, తిమిరాం, 9న ఎన్.గజపతినగరం, వాకపల్లి, వెంకటరాజుపురం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు జరుగుతాయన్నారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో బయోమెట్రిక్ ధ్రువీకరణ, ఐకెవైసి తదితర విధానాల్లో పారదర్శకంగా పాస్‌పుస్తకాల పంపిణీ ఉంటుందన్నారు.

సిపిఎస్ ఉద్యోగుల సమస్యలపై వినతి

చంద్రబాబును కలిసిన సతీష్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : సిపిఎస్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి అందజేసినట్లు మండలంలోని తురకలపూడి గ్రామానికి చెందిన ఎపిసిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ తెలిపారు. సోమవారం సచివాలయంలో చంద్రబాబును కలిశానన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా సిపిఎస్ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి ఉద్యోగులతో చర్చలు జరపాలని, చనిపోయిన ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌ను నామినీకిచెల్లించి ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎ, ఎరియర్స్‌ను చెల్లించాలని కోరినట్లు తెలిపారు దీనిపై సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -యస్ రాయవరం : మాదక ద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ విభూషణరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలు మేరకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహనలో భాగంగా మంగళవారం ఎస్ రాయవరం వినయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రజ్ఞ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు.

వృత్తి నైపుణ్యంలో రాష్ట్రస్థాయి ప్రతిభ

బ్యూటీ అండ్ వెల్నెస్ విభాగంలో పరవాడ విద్యార్థినులకు ప్రథమ స్థానం

నగదు బహుమతి చెక్కు అందుకుంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - పరవాడ : రాష్ట్ర స్థాయి వృత్తి నైపుణ్య పోటీల్లో పరవాడ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వృత్తి నైపుణ్య (స్కిల్ డెవలప్‌మెంట్) పోటీల్లో 26 జిల్లాల నుంచి 10 ట్రేడ్లకు సంబంధించి 260 ప్రాజెక్టులు ప్రదర్శించగా, బ్యూటీ అండ్ వెల్నెస్ విభాగంలో పరవాడ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి బహుమతి సాధించారు. ఈ పోటీల్లో సిహెచ్. లాస్య, ఎన్. లీలామాధురి, ఎన్. దీక్షిత, ఎస్. రుచిత అనే విద్యార్థినులు సమర్పించిన ప్రాజెక్టను న్యాయనిర్ణేతలు అత్యుత్తమంగా గుర్తించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు రూ.25వేలు నగదు బహుమతి, ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రాన్ని సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు శిక్షణనిచ్చిన వొకేషనల్ ట్రైనర్ కోమాండూరి జ్యోతిర్మయి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలో పాఠశాలకు ఘనత తీసుకువచ్చిన విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం గొల్ల రాజేశ్వరి, ఇన్‌ఛార్జి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కృషి, నైపుణ్యంతో పేద విద్యార్థినులు కూడా రాష్ట్రస్థాయిలో రాణించగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందని ఉపాధ్యాయులు అన్నారు..

పౌరహక్కులపై అవగాహన

పౌరహక్కులపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అయ్యన్నపాలెం ఎస్‌సి కాలనీలో మంగళవారం పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సింహాచలం మాట్లాడుతూ, ఎస్‌సిల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, వారి హక్కులకు భంగం కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌సిలకు చట్టం, రాజ్యాంగం, హక్కులపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో బి. వీరయ్య, ఎవిఎస్‌డబ్ల్యుఐ, గ్రామ కార్యదర్శి, విఆర్‌ఒ, యువత పాల్గొన్నారు

పారిశుధ్య పనుల పరిశీలన

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ

ప్రజాశక్తి -యస్ రాయవరం.: మండలంలోని పెద గుమ్ములూరు, తిమ్మాపురం, కొరుప్రోలు, గుడివాడ గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 26 నుండి వచ్చేనెల 4 వరకు జరిగే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లోని చెత్త కుప్పలను తొలగించాలని, చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. తడి పొడి చెత్త సేకరణ, సంపద కేంద్రాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.గుడివాడ గ్రామ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, ఉపసర్పంచ్ రామకృష్ణ రాజు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై అవగాహన

2నుంచి గ్రామాల్లో నిర్వహణకు సన్నాహాలు

అంతకాపల్లిలో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో వచ్చేనెల 2 నుంచి భూరీసర్వే జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎడి సర్వే గోపాలరాజు కోరారు. మంగళవారం సర్పంచ్ కె.కామలక్ష్మి అధ్యక్షతన వడ్డాదిలో రీసర్వే పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే నెల 2నుండి వడ్డాదిలో రీసర్వే జరుగుతుందని, రైతులకు ముందస్తుగా సమాచారం అందజేస్తామని, అందుబాటులో ఉండాలని సూచించారు..తహసీల్దార్ ఎం.లక్ష్మీ మాట్లాడుతూ రీసర్వేతో భూవివాదాలకు చెక్ పడుతుందన్నారు. వైస్ ఎంపిపిదొండా లలితా నారాయణమూర్తి, స్టేట్ గ్రంథాలయ పరిషత్ మెంబర్ సిరిగిరి శెట్టి శ్రీరామూర్తి, టిడిపి నేత దొండా గిరిబాబు, దాడి చిన గోవింద, సింగంపల్లి రమేష్, బిజెపి నేత దూది రాజేష్, దొండా నానాజీ పాల్గొన్నారు.

అంతకాపల్లిలో అవగాహన ర్యాలీ

సబ్బవరం: వచ్చే నెల రెండో తేదీ నుంచి ప్రారంభం కానున్న భూముల రీసర్వే గ్రామ సభలపై మంగళవారం మండలంలోని అంతకాపల్లి, వంగలి గ్రామాలలో రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంతకాపల్లి గ్రామసభలో తహశీల్దార్ చిన్నికృష్ణ మాట్లాడుతూ భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలలో రీసర్వేపై ఉన్న అపోహలు తొలగించడానికి అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్. వీరయ్య, సర్వేయర్ లాలం అప్పారావు, గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వంగలి సర్పంచ్ ఆకుల శ్రీహేమ గణేష్, మాజీ ఎంపిటిసి సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపిటిసి చొక్కాకుల గోవింద్, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, మాజీ సర్పంచ్‌లు రొంగలి దేముడు బాబు, సబ్బవరపు దేముడు బాబు, జనసేన నాయకులు సబ్బవరపు రమణ, పల్లా రమణ, ఉప సర్పంచ్ గొర్లె అప్పారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



మునగపాకలో వెంకన్నను దర్శించుకుంటున్న సాయికృష్ణ

ప్రజాశక్తి-మధురవాడ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తులకు వైకుంఠ నారాయణుడిగా ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 1.30 గంటలకు ఆలయాన్ని తెరచి తిరుప్పావై ధనుర్మాస ఆరాధన గంట, తోమాల, సుప్రభాత సేవ అనంతరం 2 గంటల నుండి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఈఓ జగన్ మోహనాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకట రమణ, ఇన్‌స్పెక్టర్లు శివ, కిషోర్, శ్రవణ్ పాల్గొన్నారు.

వేపగుంట : వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎన్‌స్టీవోస్ కాలనీలో సమీపంలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామిని నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్నవారిలో ఎస్‌విఎంఎస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పొలమరశెట్టి శ్రీను కుటుంబ సభ్యులు ఉన్నారు.

పరవాడ: మండలంలోని ఈ బోనంగి ఫార్మసిటీ కాలనీలో అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు ఆధ్వర్యంలో రాంకీ జిఎం నాగరాజు, సిఇఒ. లాల్‌కృష్ణ, డిజిఎం శ్రీధర్, ఈబోనంగి గ్రామ సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. పరవాడ సిఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు కల్పించారు.

మునగపాక: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని నాగులపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ స్వామిని దర్శించుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, మద్దాల కృష్ణ, విల్లూరి నూక నరసింహారావు, పాల్గొన్నారు.

దేవరాపల్లి: దేవరాపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం,మారేపల్లి పాండవుల కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం, సీతంపేట శ్రీకృష్ణ ఆలయం, తిమిరాం శివాలయం, దేవరాపల్లిలో దేవి, కృష్ణ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు.

సబ్బవరం : మండలంలోని బోదివలసకామదేను భారతీయ గోశాలలో అరిసెట్టి త్రిలోచన్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ అధినేత, చొక్కాకుల వెంకటరావు లక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొక్కాకుల గోవింద్ జ్యోతి దంపతులుకొట్యాడ కష్ణమూర్తి, సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కశింకోట : నరసింగబిల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజల్లో టిడిపి మండల అధ్యక్షులు గొంతిన శ్రీను వాసరావు, ఉగ్గిన రమణమూర్తి, కాయల మురళీ, కర్రి దుర్గి నాయుడు, మజ్జి ప్రకాష్ రావు, సర్పంచ్ కొన అరుణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ రాయవరం : స్థానిక వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం పూజలకు భక్తులు పోటెత్తారు. అనంతరం స్వామి తిరువూరు సేవలో పాల్గొన్నారు.

వడ్డాది: వడ్డాది గిరిజాంబగిరి కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్సవ విగ్రహాలతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దొండ కన్నబాబు. హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు పిఎసిఎస్ అధ్యక్షుడు దొండ నరేష్ పాల్గొన్నారు బంగారు మెట్ట వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం తెల్లవారుజాము నుండి భక్తుల రద్దీతో కిటకిటలాడింది.8 వాహనాల్లో తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు. మండలంలోని చినదొడ్డిగల్లు, కొత్తూరు, కాగిత, ఉద్దండపురం గ్రామాల నుండి హరినామ సంకీర్తన బృంద సభ్యులు పాదయాత్ర చేశారు.సీఐ మురళి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిఎస్‌పి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, సాయి, రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్పలరాజును విడుదల చేయాలి

మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి:సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్ ను రద్దు చేసి, వెంటనే విడుదల చేయాలని సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు ఎం.మహేష్ బాబు డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో గ్రీన్ కాలనీలో మంగళవారం అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ మత్స్యకారులు నిరసన తెలిపారు. పేదల సమస్యలపై పోరాడుతూ, అండగా నిలుస్తున్న అప్పలరాజు పై పీడీ యాక్ట్ పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు వై.స్వామి, ఎం.నరేష్, వసంతమ్మ, లక్ష్మి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు .

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుధారాణి

ఈ క్రాప్‌తో ప్రయోజనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సాలిక మల్లవరం గ్రామంలో మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ఈ - క్రాప్ నమోదు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె తెలిపారు. రైతులు బ్యాంకులకు రుణం కోసం మీరు వేసిన పంట నమోదు కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు పెదిరెడ్ల మల్లేశ్వరరావు, కన్వీనర్ ఇందల శ్రీను, వీఆర్వీ దేవి, గ్రామ కమిటీ కార్యదర్శి గెట్ల సత్తిబాబు, రమణ, ఎం.మల్లేశ్వరరావు, బి.ప్రసాద్, కే.కొండయ్య రైతులు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ

జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గొలుగొండ:ఏపిఎన్జీవో సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా గొలుగొండ ఎంపిడిఒ ఉలబాల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనకాపల్లిలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సంద ర్భంగా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఉద్యోగ సోదరులకు, సంఘం నాయ కులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సంఘం బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు.

డిపోల్లో రాగులు ఇవ్వండి

ప్రజాశక్తి -రావికమతం: వృద్ధులకు, వికలాంగులకు కిలో రాగులు తప్పనిసరిగా ఇవ్వాలని రావికమతం మండల తహసిల్దార్ అంబేద్కర్ రేషన్ డీలర్లను ఆదేశించారు. ఇంటింటికి సరుకులు కార్యక్రమం కొన్ని రేషన్ డిపోల్లో సక్రమంగా జరగకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని 52 రేషన్ డిపోల డీలర్లతో ఆయన మంగళవారం తన కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చౌకధరల దుకాణాలకు ఇప్పటికే రాగులు సరఫరా జరిగిందని, డీలర్లు అందరూ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. బియ్యం ఇచ్చేటప్పుడు ఒక కేజీ బియ్యం తగ్గించి దానికి బదులుగా రాగులు ఇవ్వాలని ఆదేశించారు. సిఎస్‌డిటి భాస్కరరావు మాట్లాడుతూ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా డీలర్లు రెండు పర్యాయాలు తహసిల్దార్ కార్యాలయంలో సమావేశానికి తప్పక హాజరవ్వాలన్నారు.కొంతమంది డీలర్లు సమయపాలన పాటించడం లేదని, రాగులు పంపిణీలో ఎక్కడైనా అవకతవక జరిగినట్లుగా తమ దృష్టికి వస్తే డీలరుపై 6ఎ కేసులు నమోదు చేస్తామన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, గొలుగొండ ఎస్సై పి.రామారావు ఆధ్వర్యంలో మంగళవారం గొలుగొండ ఏపిఆర్ పాఠశాల విద్యార్థులతో కలిసి సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి గొలుగొండ జంక్షన్ వరకు గంజాయి వద్దు నో డ్రగ్స్ నినాదాలతో సుమారు 600 మంది విద్యార్థులు భారీ అవగాహన ర్యాలీ చేశారు. విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకంతో కలిగే ప్రమాదాలు వీడియోల రూపంలో చూపించి వాటి దుష్ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గంజాయి లేదా డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే 112, 1972 నెంబర్లకు కాల్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, టీచర్లు

అడ్డురోడ్డు కేంద్రంగా ..

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి -నక్కపల్లి:అడ్డురోడ్డు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నక్కపల్లిలో హోంమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, అడ్డురోడ్డు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. ఇప్పటికే అధికారులు స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం హోం మంత్రి అనిత నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.స్టీల్ ప్లాంట్, బొమ్మల పరిశ్రమతో పాటు పలు పరిశ్రమలను ఈ ప్రాంతానికి తీసుకురావడంలో మంత్రి అనిత కీలక పాత్ర పోషిస్తున్నారని, దీంతో లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. రాయవరం మండలం టీడీపీ అధ్యక్షులు అమలంకంటి అబద్దం, నక్కపల్లి మండలం టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, కోరుప్రోలు పిఎసిఎస్ ఛైర్మన్ గుర్రం రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతన సంవత్సర వేడుకల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి జిల్లా పోలీసులు హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ కీలక ఆదేశాలను జారీ చేశారు. హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వినోద కార్యక్రమాల్లో అశ్లీలత లేదా నగ్న ప్రదర్శనలు ఉండకూడదని, నిర్దేశించిన సమయానికి సంబరాలు ముగించాలని సూచించారు. పార్టీల్లో డ్రగ్స్, నార్కోటిక్స్ లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగంపై కఠిన నిఘా ఉంటుందని,ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, బైక్, కారు రేసింగ్‌లు, డ్రంకెన్ డ్రైవ్, మహిళలు, బాలికలపై వేధింపుల నియంత్రణకు ప్రత్యేక బృందాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. బాణసంచా కాల్చడంపై పూర్తినిషేధంతోపాటు డిజె సౌండ్ సిస్టమ్ వినియోగంపై పరిమితులు విధించారు. ముందస్తు అనుమతుల్లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమన్నారు. ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : మండలంలోని తేరువుపల్లి , పోతిరెడ్డి పాలెం గ్రామ పంచాయతీలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మోహనరావు మాట్లాడుతూ, వరి కోతల అనంతరం మినుములు, పెసలు వేసుకున్న రైతులకు మూడు నుంచి నాలుగు ఆకుల దశలలో వేప నూనె సంబంధిత పురుగుమందులు పిచికారి చేస్తే రసం పీల్చే పురుగులు నుంచి పైర్లకు రక్షణ ఉంటుందన్నారు. యలమంచిలి షేకిలపాలెం, పోతిరెడ్డి పాలెం, లైన్ కొత్తూరు రైతు సేవా కేంద్రాల్లో 72 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మినుములు, పెసలు, రాగులు, నువ్వుల విత్తనాలు వ్యవసాయ అధికారి కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆధార్, భూమి పాస్‌బుక్ తీసుకొచ్చి పొందవచ్చని సూచించారు రబీలో ఈక్రాప్ నమోదు చేస్తున్నామని, రైతులు తాము సాగుచేసే పంటల వివరాలను నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నారాయణరావు, రైతులు గల్లా రాము పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలోని వినాయకుని కోవెల సమీపంలో ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ వి.నానాజీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖ నుంచి ప్రముఖ వైద్యనిపుణులు టి. గణేష్ తదితరులు రోగులకు కిడ్నీ, గుండె, లివర్, షుగర్, బిపి, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ వి. నానాజీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోలేనటువంటి పరిస్థితుల్లో ఉన్నారన్నారు. అటువంటి వారికి ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ శిబిరాలు ఏర్పాటు చేయడంతో వ్యాధి నిర్ధారణ చేయడమే కాకుండా, వ్యాధికి సంబంధించిన మందులు వాడుకునే పరిస్థితి ఉంటుందన్నారు. తద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఇటువంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ముత్తూట్ ఫైనాన్స్ సిబ్బంది వంశీ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో అధ్యక్షులు కర్రి రాంగోపాల్ అధ్యక్షతన పెదబొడ్డేపల్లి ఆర్సీఎం చర్చి ఆవరణలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎ.పీ సింగ్ పుట్టినరోజు సందర్భంగా వందమంది నిరుపేదలకు చీరలు, దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ చైర్ పర్సన్ సిహెచ్.ఇందిరా మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బేతిరెడ్డి విజయకుమార్, క్లబ్ సభ్యులు వికాస్ సతీష్, శంకర్ లాల్, ఊడి అప్పారావు, అల్లూరి శ్రీరామ రాజ్, ప్రభాకర్, హర్షవర్ధన్, విజయ కుమారి, గిరి ప్రసాద్, దాహి సింగ్, ఆర్సీఎం చర్చి ఫాదర్ రత్నాకర్ పాల్గొన్నారు.

వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని గర్నికం కస్తూరిబా గాంధీ పాఠశాలలో "గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల ప్రభావం" అనే అంశం పై విద్యార్థులకు మంగళవారం వ్యాసరచనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘువర్మ మాట్లాడుతూ, గంజాయి, మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి రవాణా, విక్రయాలతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వీటితో కుటుంబాలు కూడా పూర్తిగా సర్వనాశనం అవుతా యని, ఈ కేసుల్లో పోలీసులకు పట్టుబడితే కఠినమైన శిక్షలు పడతాయన్నారు. దీంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారన్నారు. అనంతరం గంజాయి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

టోమో థెరపీ రాడిక్సార్ట్ ఎక్స్9ను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్‌లో

టోమోథెరపీ రాడిక్సార్ట్ ఎక్స్9 ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఎంవిపి కాలనీలో ఉన్న మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అత్యాధునిక టోమోథెరపీ రాడిక్సార్ట్ ఎక్స్9ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ వూన్న మాట్లాడుతూ దీని ద్వారా క్యాన్సర్ గడ్డను ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకుని, చుట్టూ ఉన్న ఆరోగ్యకర ఆవయవాలకు తక్కువ నష్టం కలిగే విధంగా రేడియేషన్ చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు. ఈ ఆధునిక సాంకేతికత క్లిష్టమైన క్యాన్సర్లు, పిల్లల క్యాన్సర్లు, తల, మెడ క్యాన్సర్లు, ప్రోస్టేట్ క్యాన్సర్, స్కిన్ ట్యూమర్లు వంటి చికిత్సలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ యూనిట్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌లో తొలి, ఏకైక ఏపిక్స్ స్థాయి క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందన్నారు. ఇది అధునాతన, నైతిక, మరోగ కేంద్రత క్యాన్సర్ చికిత్సకు సంస్థ నిబద్ధతను ప్రతిబింభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు, ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో పశువైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష గ్రామస్తులతో మాట్లాడుతూ, కుక్క కరిచిన వెంటనే చల్లటి నీరుతో లైఫ్ బాయ్ సబ్బుతో గాయాన్ని వెంటనే కడగాలని తెలిపారు.

టీకాలు వేస్తున్న సిబ్బంది

ఆలస్యం చేయకుండా మొదటి మూడు గంటల్లోనే వైద్యులను సంప్రదిస్తే పిచ్చికుక్క వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేస్తారని చెప్పారు. ఆలస్యం చేయకుండా కుక్క కరిస్తే టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేడిపేట పశువైద్యశాల పరిధిలోని పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు

బెర్తుల కేటాయింపులో ప్రాధాన్యతేదీ ?

- రైల్వే రిజర్వేషన్ తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - విశాఖపట్నం: సీనియర్ సిటిజన్లకు రైల్వే టిక్కెట్‌లో రాయితీ తీసేసిన ప్రభుత్వం ఇప్పుడు బెర్తుల కేటాయింపులో కూడా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2026 జనవరి 5న విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు గరీబ్‌రథ్ రైలుకు 69 సంవత్సరాల మహిళ రిజర్వేషన్ చేయించుకున్నారు. లోయర్ బెర్త్ ప్రాధాన్యత పెట్టగా ఆమెకు అప్పర్ బెర్త్ కేటాయించారు. అదేవిధంగా 64 సంవత్సరాల పురుషునికి కూడా అప్పర్ బెర్త్ కేటాయించారు. 47 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళకు మిడిల్‌బెర్త్ కేటాయించడం ఇక్కడ గమనార్హం. టిక్కెట్‌లో రాయితీ ఎలాగూ తీసేశారు. బెర్త్‌ల కేటాయింపులో కూడా ఇంత నిర్లక్ష్యమేమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై బెర్త్‌లు కేటాయిస్తే తాము ఎలా ఎక్కగలమని వాపోతున్నారు.



'అల్లూరి స్మారక జ్యోతి' యాత్ర ప్రారంభం

- సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి - పలుచోట్ల యాత్ర బృందానికి అపూర్వ స్వాగతం

కెడి పేటలో జ్యోతిని వెలిగించి యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ: ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరిగే సీఐటీయూ మహాసభల నేపధ్యంలో గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కు నుండి అల్లూరి స్మారక జ్యోతి యాత్ర మంగళవారం ప్రారంభించారు. ముందుగా సీతారామరాజు సమాధులకు ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి నివాళు లర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, అల్లూరి స్మారక జ్యోతి కృష్ణదేవిపేట అల్లూరి పార్కు నుండి విశాఖపట్నం మహాసభల ప్రాంగణానికి చేరుకుంటుందన్నారు. మన్యం వీరుడు, బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నడియాడిన నేలపై సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు జరుగుతున్నందున కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్క్ నుండి అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తిని భవిష్యత్తు కార్మిక వ్యతిరేక పోరాటాలకు ఉత్తేజం కలిగించేందుకు అల్లూరి స్మారక జ్యోతి యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలకు పూనుకుందన్నారు. అందులో భాగంగానే లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు కట్ట బెడుతున్నారని హెద్దేవా చేశారు. ప్రకృతి వనరులను పెట్టుబడిదారులకు దారాధత్వం చేస్తున్నారని విమర్శించారు. దీంతో భవిష్యత్ తరానికి ఉపాధి అవకాశాలు లేకపోవడమే కాక, పేదరికం, నిరుద్యోగం తీవ్రమవుతుందన్నారు. పరిశ్రమల పేరుతో రైతుల నుండి భూముల్ని లాక్కుంటున్నారని, దీనితో ఆహార సంక్షోభం తలెత్తుతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు నెత్తిన వేసుకోవడంతో ఆ పార్టీ కంటే అతి ఉత్సాహంతో పని చేస్తుందన్నారు. ప్రజల పక్షాన పోట్లాడుతున్న కార్మిక, రైతు ఉద్యమాలపై, నాయకులపై తీవ్రమైన నిర్బంధం, దుర్మార్గమైన చట్టాలను ప్రయోగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో జరుగుతున్న మహాసభలు దేశంలో కార్మికులు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారానికి, అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ, ఉద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకొని భవిష్యత్తు పోరాటాలకి సిద్ధం కావడానికి ఈ అల్లూరి స్మారక జ్యోతి యాత్రను చేపట్టడం జరిగిందన్నారు. మహాసభల ముగింపుగా జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు కార్మికులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కే.రామకృష్ణ, గంగరాజు, భూషణం, శివ, అంగన్వాడీ, ఆశ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో...

నర్సీపట్నం రూరల్: విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కు నుండి ప్రారంభమైన అల్లూరి స్మారక జ్యోతి యాత్ర మంగళవారం మధ్యాహ్నం నర్సీపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా ఈ యాత్రకు ముఠా కార్మికులు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, విశాఖలో జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు సామ్రాజ్యం, రమణమ్మ, కృష్ణవేణి, సాంబ, రాము, మున్సిపల్ వర్కర్ నాయకులు బాబురావు, ప్రసాదు, రమణ పాల్గొన్నారు

నర్సీపట్నంలో..

కశింకోట : సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని కెపిపేటలోని అల్లూరి సీతారామరాజు సమాధి నుంచి సిఐటియు ఆధ్వర్యంలో ప్రారంభమైన అల్లూరి స్మారక జ్యోతియాత్రకు మంగళవారం మండలంలో కన్నూరుపాలెం వద్ద అపూర్వస్వాగతం లభించింది. కన్నూరుపాలెం, తాళ్ళ పాలెం జంక్షన్, బయ్యవరం, కశింకోట మీదుగా సాగిన అల్లూరి స్మారక లజ్యోతి యాత్రలో భాగగా అల్లూరి వేషధారణలో ఉన్న వ్యక్తితోపాటు సిఐటియు నేతలు చలో విశాఖ పేరిట సిఐటియు మహాసభకు తరలిరావాలని ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, భవన నిర్మాణ కార్మికులు సంఘ జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఈరెల్లి చిరంజీవి, బి.గంగరాజు, అల్లూరి వేషధారణలో పూడి అర్జున్‌రావు, కశింకోట మండల సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు

అనకాపల్లి : ఈనెల 31నుంచి విశాఖపట్నంలో ప్రారంభం కానున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను పురస్కరించుకుఉని కేడీపేట అల్లూరి స్మారక కేంద్రం నుంచి బయలుదేరిన అల్లూరి స్మారక జ్యోతి నర్సీపట్నం, తాళ్లపాలెం, కశింకోట మీదుగా అనకాపల్లి చేరుకుంది. అనకాపల్లి నెహ్రూ జంక్షన్లో సిఐటియు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనకాపల్లి పట్టణంలో వివిధ జంక్షన్‌లో సిఐటియు మహాసభ జయప్రదానికి ప్రచారం చేస్తూ, కరపత్రాలను పంచుతూ జ్యోతి యాత్ర సాగింది. ఈ సందర్భంగా స్వాగత సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోనే తల మానికంగా నిలిచే సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభలకు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, పిఎన్ వి పరమేశ్వరరావు, అనకాపల్లి మండల కన్వీనర్ కాళ్ల తాళయ్య బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, అల్లూరి వేషధారణ నాయకులు అర్జున్ పాల్గొన్నారు.

తాళ్లపాలెం జంక్షన్‌లో..

4న సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయండి

అనకాపల్లి : సిఐటియు అఖిల భారత మహాసభలో భాగంగా వచ్చేనెల 4న నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ పిలుపునిచ్చారు. మంగళవారం శంకరం గొడౌన్స్ వద్ద అనకాపల్లి బేవరేజెస్ వర్కర్స్ యూనియన్ సమావేశం, అనంతరం నిర్వహించిన ప్రచారసభలో వారు మాట్లాడుతూ గడచిన ఐదున్నర దశాబ్దాలుగా కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిఐటియు అఖిలభారత మహాసభ ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారిగా విశాఖపట్నంలో జరగనుందని, పెద్దఎత్తున కార్మికులు తరలివచ్చి బహిరంగసభను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా, ఉపాధి చట్టానికి తూట్లు పొడిచిన కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, సమగ్ర కార్మికచట్టం అమలు, ప్రైవేటీకరణ నుంచి ప్రభుత్వరంగసంస్థల పరిరక్షణపై మహాసభలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు రమణ, కొండారావు, సిఐటియు మండల కన్వీనర్ తాళయ్య బాబు పాల్గొన్నారు.

బేవరేజస్ కార్మికులతో మాట్లాడుతున్న శంకరరావు